




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 345 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | బుధవారం 23 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


# జూరాలకు నీళ్లివ్వండి

## - కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

- జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్
- నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి
- జూరాల నీటి కోసం రైతుల ఆందోళన



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిసితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం
- వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు 2 రోజుల వర్ష సూచన
- 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక
- అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు ....

2



## కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం..

### డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్



- 'వందేమాతరం' గీతంపై కర్ణాటక ప్రభుత్వానికి గవర్నర్ లేఖ
- గీతాన్ని రెండు చరణాలకే పరిమితం చేయడంపై తీవ్ర అభ్యంతరం
- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తుతాయని హెచ్చరిక

2

## చర్చలు విఫలం.. 5 రోజులు బ్యాంకులు బంద్..!




- దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు
- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె
- శని, ఆదివారాలతో కలిపి మొత్తం ఐదు రోజులు బ్యాంకులు బంద్
- వారానికి 5 రోజుల పని ప్రధాన డిమాండ్‌గా ఉన్న యూనియన్లు
- లావాదేవీలు ముందుగానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన

2

## ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం.. ప్రధాని మోదీ ట్వీట్



2

## జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట



- మహిళను లైంగికంగా వేధించారనే ఆరోపణలు
- ఇప్పటికే సీఐపై సస్పెన్షన్ వేటు వేసిన ప్రభుత్వం
- శ్రీనివాసులు రెడ్డిని అరెస్ట్ చేయవద్దన్న సుప్రీంకోర్టు

2

## నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు..

### - 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు



- నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు
- రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు
- హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం
- బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు

2

## మార్మోగుతున్న సారు పాట.. కేసీఆర్ పాటలతో యువత ఉర్రూతలు



- గణేశ్ శోభాయాత్రలో కేసీఆర్ నామజపం
- యూత్‌లో ఉప్పొంగుతున్న అభిమానం
- మైకులు లాక్కుంటున్నా లెక్కచేయని జెన్‌జీ
- రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ మానియా ఆవిష్కృతం
- ట్యాంక్‌బండ్‌లో వారం రోజులుగా కేసీఆర్ వైబ్స్
- ఎస్ఎంలో కేసీఆర్ రీల్స్‌కు విశేష ఆదరణ

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో తిరిగి కేసీఆర్ పాలనా దృశ్యం పునరావిష్కరణ అవుతుందా? తెలంగాణ ప్రజలు పోగొట్టుకున్న చోటే తిరిగి వెతుక్కుంటున్నారా? మునుపెన్నడూ లేనివిధంగా కేసీఆరే తిరిగి అధికారంలోకి రావాలని తమ కేరింతలతో నేటి జెన్‌జీ తరం ఆహ్వానిస్తున్నదా? అంటే అవుననే అంటున్నాయి గణేశ్ నిమజ్జన శోభాయాత్రలు. ఒకవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బురదజల్లడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పెట్టుకోగా.. అదే కేసీఆరే రేపటి ప్రత్యామ్నాయం, ఆయన ఆనవాళ్లే సత్యం, ఆయన ..

2

## విదేశీ ఉద్యోగాల మోసాలు..

### - రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ కీలక హెచ్చరిక

- విదేశీ ఉద్యోగాల పేరుతో పెరుగుతున్న మోసాలపై రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక
- అధిక జీతాల ఆశ చూపి సైబర్ నేరగాళ్లుగా మారుస్తున్నారని వెల్లడి
- నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశంసోషల్
- మీడియా, జాబ్ పోర్టల్స్‌పై నిఘా పెట్టాలని కీలక సూచన
- అక్రమ ఏజెంట్లను గుర్తించేందుకు గ్రామ పంచాయతీల సహాయం తీసుకోవాలని సలహా



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో ("డాంకీ రూట్స్") విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రం నిర్దేశించింది. సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో వస్తున్న అనుమానాస్పద ఉద్యోగ ప్రకటనలపై సైబర్ సెల్స్ ద్వారా నిఘా ఉంచాలని సూచించింది. బాధితుల నుంచి డిజిటల్ సంభాషణలు, నగదు చెల్లింపుల రికార్డులను కీలక ఆధారాలుగా వెంటనే సేకరించాలని ఆదేశించింది....

2

# విదేశీ ఉద్యోగాల మోసాలు..

## - రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ కీలక హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..** విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ అనుమతి లేకుండా నడుస్తున్న ఏజెన్సీలను తక్షణమే మూసివేయాలని స్పష్టం చేసింది. నకిలీ ఏజెంట్లపై మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం (యాంటీ ట్రాఫికింగ్) కింద కఠిన కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. అక్రమ వలసల ముప్పుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ 'ఇ-మైగ్రేట్' పోర్టల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. అనధికార ఏజెంట్లను గుర్తించే ప్రక్రియలో గ్రామ పంచాయతీలను సైతం భాగస్వాములను చేయాలని కేంద్రం పేర్కొంది.

# చర్చలు విఫలం..

## 5 రోజులు బ్యాంకులు బంద్..!

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ. 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు. ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

# జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

**మొదటిపేజీ తరువాయి..** మహిళపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి బలవంతంగా అబార్షన్ చేయించారనే తీవ్ర ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు శ్రీనివాసులు రెడ్డిని అరెస్టు చేయవద్దని, ఆయనపై ఎలాంటి బలవంతపు చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని హైదరాబాద్ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఈరోజు సుదీర్ఘ విచారణ చేపట్టింది. బాధితురాలిని లైంగికంగా వేధించారనే ఆరోపణలపై గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ క్రమంలో అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఆయన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ శ్రీనివాసుల రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టి పోలీసులకు రక్షణ ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం..

## అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

**మొదటిపేజీ తరువాయి..** తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం..

## - డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్

**మొదటిపేజీ తరువాయి..** జాతీయ గీతం 'వందేమాతరం' గానంపై కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని కేవలం రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతూ ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, వీటిని వెంటనే పునఃపరిశీలించాలని ఆయన కోరారు. 2026 సెప్టెంబర్ 8వ తేదీన కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని లేదా గవర్నర్ హాజరయ్యే కార్యక్రమాలు మినహా, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతంలోని మొదటి రెండు చరణాలు మాత్రమే పాడాలని అందులో పేర్కొంది. అయితే, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టం-2026 సవరణ ప్రకారం జాతీయ గీతానికి కూడా చట్టబద్ధమైన రక్షణ ఉందని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్ తన లేఖలో స్పష్టం చేశారు. జాతీయ చిహ్నాలపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి శాసన, కార్యనిర్వాహక అధికారాలు లేవని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 162, 256, 257(1)ను ఆయన ఉటంకించారు. ఈ ఉత్తర్వులను ఇలాగే కొనసాగిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తడమే కాకుండా, రాజ్యాంగపరమైన చిక్కులకు దారితీస్తుందని గవర్నర్ హెచ్చరించారు. కావున, 'వందేమాతరం' పాడే విషయంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

# ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం..

## ప్రధాని మోదీ ట్వీట్

**మొదటిపేజీ తరువాయి..** ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలి సారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# ట్రంప్‌కు జై కొట్టినా..

## భారత సంతతికి తప్పని అవమానాలు!

- ట్రంప్‌కు మద్దతిస్తున్న భారత సంతతికి జాత్యహంకార వ్యాఖ్యలు
- భావజాలం కన్నా జాతే ముఖ్యమంటున్న కొందరు ట్రంప్ మద్దతుదారులు
- భారత సంతతి నేత హర్మీత్ ధిల్లాన్‌పై సొంత వర్గం నుంచే దాడి
- గతంలో ప్రోగ్రెసివ్‌లకే పరిమితమైన దాడులు.. ఇప్పుడు కన్జర్వేటివ్‌లపైనా
- "అసలైన అమెరికన్" అని నిరూపించుకోవాల్సిన దుస్థితి

**నేటి శుభోదయ, అంతర్జాతీయం :** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్, ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉన్న భారత సంతతి కన్జర్వేటివ్‌లకు ప్రస్తుతం అనూహ్య అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ భావజాలం తమను అమెరికన్‌లుగా పూర్తిస్థాయిలో గుర్తిస్తుందని వారు భావిస్తున్నప్పటికీ, వారిలో కొందరు సొంత పార్టీ నుంచే జాత్యహంకార వ్యాఖ్యలను, వివక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ రాజకీయాల్లో భావజాలానికే ప్రాధాన్యత ఉంటుందని, జాతి, మూలాలకు తావుండదని చాలా మంది భారతీయ-అమెరికన్లు విశ్వసించారు. అయితే, ఇటీవలి పరిణామాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వారు భావజాల పరంగా తమ నిబద్ధతను చాటుకున్నప్పటికీ, "మీరు ఎంతవరకు అమెరికన్లు?" అనే ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రముఖ కాలమిస్ట్ చిదానంద్ రాజఘట్ట తన కథనంలో విశ్లేషించారు. ట్రంప్ ప్రభుత్వంలో పనిచేస్తున్న చండీగఢ్ మూలాలున్న హర్మీత్ ధిల్లాన్, తనను తాను అమెరికన్‌గా చాటుకునేందుకు బీఫ్ డిన్నర్ ఫొటో పోస్ట్ చేశారు. దీనిపై 'మాగా' మద్దతుదారులే ఆమెను ఎగతాళి చేశారు. తనను 'పేపర్‌వర్క్ అమెరికన్' అంటూ రోజూ జాత్యహంకార వ్యాఖ్యలు ఎదుర్కొంటున్నానని ఆమె స్వయంగా తెలిపారు. అలాగే, దినేశ్ డిసౌజా తన కుమార్తెపై వచ్చిన జాతి వివక్ష దాడిని తిప్పికొట్టేందుకు, ఆమె తల్లి శ్వేతజాతీయురాలని చెప్పాల్సి రావడం విమర్శలకు దారి



తీసింది. గతంలో వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ వంటి వారు కూడా తమ అమెరికన్ గుర్తింపును నిరూపించుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. సాధారణంగా ప్రగతిశీల భావాజాలం కలిగిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు 'మీ దేశానికి తిరిగి వెళ్లండి' వంటి విమర్శలను మొదటి నుంచీ ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్ వాదాన్ని అత్యంత బలంగా వినిపిస్తున్న కన్జర్వేటివ్‌లు సైతం అదే వర్గం నుంచి ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం గమనార్హం.

# 2 ఎం ఎల్ సిరంజీవి లు 5000 రూపాయల ఖరీదైన 20 బాక్సులు వితరణ.

**ఏన్కూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఏన్కూర్ ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు సిరంజీ లు కొరత ఉన్నదని తెలుసుకున్న ఏన్కూర్ మెడికల్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 2 ఎమ్ ఎల్ సిరంజీలు 20 బాక్సులు, 5000 రూపాయలు ఖరీదైన బాక్సులను ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుడ్ల వెంకటేశ్వరరావు, సీనియర్ ఆర్.ఎం.పి డాక్టర్ కోపెల రామారావు, మెడికల్ అసోసియేషన్ మండల కమిటీ సభ్యులు పాలెపు పాపారావు, షేక్ హుస్సేన్ ఉద్దీన్, బి మోహన్, షేక్ పెంటు సాహెబ్, ఆర్ శివ , సీనియర్ ప్రాక్టీషనర్ భస్మాంగి నాగేశ్వర రావు, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ ఉప్పెర్ల వెంకటరమణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.... ప్రభుత్వ వైద్యశాలలో గత కొన్ని రోజుల నుండి సిరంజీ లు లేక వచ్చిన పేషెంట్లకు వైద్యం అందించడం కష్టంగా ఉందని ఆ విషయాన్ని ఏన్కూర్ మెడికల్ అసోసియేషన్ తెలియజేయడం జరిగిందని వారు మాకు ఈరోజు 5000 రూపాయలు విలువైన సామాగ్రిని అందజేసినందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# బోడుప్పల్ సర్కిల్‌లో అక్రమ కట్టడాల జోరు -చర్యల్లో ఎందుకీ తేడా?

- సెటిల్‌మెంట్ కోసమే జేసీబీ ఎంటర్ కావడం లేదా? టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల ఆరోపణలు
- అక్రమ షెడ్లపై బోడుప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఉక్కుపాదం.. ఫ్రీ విలేజ్ వద్ద మాత్రం మౌనం ఎందుకు?
- బోడుప్పల్ రాజశేఖర్ కాలనీ,గాయత్రి హిల్స్‌లో అక్రమ షెడ్ కూల్చివేతలు.. ఫ్రీ విలేజ్ షెడ్‌పై ఎందుకీ జాప్యం?
- అక్రమ కట్టడాలపై యాక్షన్‌లో సెలెక్టివ్ పాలసీనా? బోడుప్పల్‌లో స్థానికుల ప్రశ్నలు
- లోకల్‌కు ఒక న్యాయం.. నాన్‌లోకల్‌కు మరో న్యాయమా? బోడుప్పల్ టౌన్ ప్లానింగ్‌పై ఆగ్రహం
- అక్రమ షెడ్లపై కొరడా.. మరికొన్నింటిపై మౌనం! అధికారుల తీరుపై అనుమానాలు
- 24 గంటల్లో యాక్షన్ ఎక్కడ? ఫ్రీ విలేజ్ అక్రమ షెడ్‌పై అధికారుల మౌనం
- అక్రమ కట్టడాలపై కఠిన చర్యలంటూ.ఫ్రీ విలేజ్‌లో మాత్రం ఎందుకీ నిశ్శబ్దం
- కూల్చివేతల్లోనూ తేడాలా? బోడుప్పల్ సర్కిల్ అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు
- ఒకచోట కూల్చివేత మరోచోట మౌనం! బోడుప్పల్ టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమర్శలు

**బోధుప్పల్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు, అక్రమ షెడ్ల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కూల్చివేతలు చేపడుతున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గత వారం రోజుల వ్యవధిలో రాజశేఖర్ కాలనీ, గాయత్రి హిల్స్ కాలనీల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇదే సమయంలో ఫ్రీ విలేజ్ కాలనీ పరిసరాల్లో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ షెడ్‌పై ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఒకవైపు అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు జరుగుతుండగా.మరోవైపు ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలపై చర్యలు ఆలస్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు.లోకల్‌కు ఒక న్యాయం.. నాన్‌లోకల్‌కు మరో న్యాయమా? అంటూ స్థానికులు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కొందరి నిర్మాణాలపై వేగంగా చర్యలు తీసుకుంటూ, మరికొన్ని నిర్మాణాల విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోందో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంతం,వ్యక్తి అనే తేడా లేకుండా అన్ని అక్రమ కట్టడాలపై ఒకే విధమైన నిబంధనలు,ఒకే విధమైన చర్యలు అమలు చేయాలని వారు కోరుతున్నారు.ఫ్రీ విలేజ్ పరిసరాల్లోని అక్రమ షెడ్‌పై అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ వ్యవహారంపై టౌన్ ప్లానింగ్ అధికారులు,డిప్యూటీ కమిషనర్ స్థాయిలో స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.



# మెట్లు లేని కాలువ.. ప్రమాదంలో మూగజీవాలు.

- అధికారులపై, కాంట్రాక్టర్లపై రైతులు ఆగ్రహం.

**ఏన్కూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రం పరిధిలోని సీతారామ లింకు కాలువ ప్రమాదాలకు నెలవుగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపల్లెవాడ–ఇమామ్‌నగర్ గ్రామాల మధ్య పొలాల సమీపంలోని కాలువలో రేపల్లెవాడ గ్రామానికి చెందిన రైతు రామకృష్ణకు చెందిన ఆవు ప్రమాదవశాత్తు పడిపోయి గాయాలపాలైంది. ఈ ఘటనలో ఆవు రెండు కొమ్ములు, నడుము ప్రాంతంలో గాయాలైనట్లు రైతు తెలిపారు.ఆవు కాలువలో పడిన సమయంలో నీటి ప్రవాహం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో కాలువలో నీరు ప్రవహించి ఉంటే ఆవు నీటిలో కొట్టుకుపోయి మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు లేకపోవడంతో స్థానికులు వెంటనే స్పందించి ఆవును కాలువ నుంచి బయటకు తీసుకువచ్చారు. అయితే భవిష్యత్ లో కాలువలో నీరు ప్రవహిస్తున్న సమయంలో ఇలాంటి ఘటనలు జరిగితే పరిస్థితి తీవ్రంగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.కాలువకు ఇరువైపులా ప్రమాదాల నివారణకు అవసరమైన రక్షణ ఏర్పాట్లు లేకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలువలోకి దిగేందుకు, బయటకు ఎక్కేందుకు అనువుగా మెట్లు ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, రైతులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు, పశువులు కాలువ పరిసరాల్లో సంచరిస్తుండటంతో ఏమాత్రం అదుపుతప్పినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ గోడలు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, అవసరమైన చోట్ల దిగేందుకు మెట్లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పొంచి ఉందని తెలిపారు.గతంలో కూడా ఇదే కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయిన ఘటన చోటుచేసుకుందని రైతులు గుర్తుచేశారు. అప్పట్లోనే అధికారులు కాలువ పరిస్థితిని పరిశీలించి తగిన రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ప్రస్తుతం ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కావని అంటున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాలువ పరిసరాల్లో రైతులు, పశువులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, ఇలాంటి ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని రైతులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు సీతారామ లింకు కాలువను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ గోడలు, మెట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహం ఉన్న సమయంలో మనుషులు, పశువులు ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





# గణపతి సన్నిధి లో ఘనంగా కుంకుమ పూజ



**ఇల్లందు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం / ఎర్రయిగూడెం గ్రామపంచాయతీ పరిధి లో ఎర్రయిగూడెం గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణనధుని కి భారీ సంఖ్యలో మహిళలు పాలొని ఘనంగా పూజ కార్యక్రమం చెపట్టారు విగ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా అందరి పైన ఉండాలని గణపతి ని వేడుకున్నారు ఈకార్యక్రమంలో.

# మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

- ప్రిన్సిపల్ విద్యార్థులకు పిలుపు.



**ఏన్కూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మీటి కోటి సింహాచలం అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన" ఏక్ పే డ్ మా కే నామ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని మొక్కలు మనిషి జీవితానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన అన్నారు. మొక్కలు నాటడం వల్ల ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని, అది మన సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలిసి120 మొక్కలు నాటారు. సుందర్ ,కవిత ఆధ్వర్యంలో ఈ సి ఓ క్లబ్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి: సర్పంచ్ భాస్కర్ గౌడ్



**కేశంపేట, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ,, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సపూర అమీర్, వార్డు సభ్యులు రిజ్వాన బేగం, మోహిజ్, మంజుల జంగేశ్, పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రజిత, వీవో చిత్కళ, నాయకులు ముత్యాలు, జంగయ్య, బోడ మల్లేష్, బాలు, శివతో పాటు గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
బుధవారం | హైదరాబాద్
23 - 09 - 2026
www.netisubhodaya.com



## జిల్లా స్థాయి పద్య పోటీల్లో శరణ్యకు ద్వితీయ బహుమతి




**కేశంపేట, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అనుమతితో జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి పద్యాల పోటీ "పద్య తోరణం"లో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కొత్తపేట పాఠశాల విద్యార్థిని ఎం. శరణ్య ప్రతిభ కనబరిచింది. పదో తరగతి విభాగంలో నిర్వహించిన పోటీల్లో శరణ్య ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చింది. బహుమతిగా రూ.3,000 నగదు అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని శరణ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. పద్య పోటీలో ప్రతిభ కనబరిచి బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ పాల్గొని తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని ఉపాధ్యాయులు సూచించారు. శరణ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కమనీయం చిన్నారి అక్షయ నృత్యం

- **సినీ నటుడు సుమన్ అభినందనలు**



**షాద్‌నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** సాంప్రదాయ అలంకరణలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం కన్నుల పండుగగా ఉందని సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అభినందన సంస్కృత సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలలో భాగంగా 'అభినందన అక్కినేని పురస్కారని ఎంపికై కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలను తిలకించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆధునిక సమాజంలోనూ మన సాంప్రదాయ కళలపై మక్కువ పెంచుకుంటూ చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని అభ్యసించడం అభినందనీయమన్నారు.షాద్‌నగర్ పట్టణానికి చెందిన నాట్య నివేదాలయం కూచిపూడి గురువు భార్గవి శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు తేజశ్రీ, నందిత, శ్రీయుక్త, ప్రణవి, ఆద్యశ్రీ, కాత్యాయిని, ఆరాధ్యతో పాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటపై చీడపీడల దాడి.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

- **క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి విజయచంద్ర**



**షాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వరి పంటలో చీడ పీడలు, తెగుళ్లను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర రైతులకు సూచించారు. కుమ్మరిగూడ గ్రామంలో రైతులు అంజయ్య, హరికృష్ణ, క్రిష్ణయ్య సాగు చేస్తున్న వరి పొలాలను ఆయన సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, గోధుమరంగు దోమ, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు వంటి సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

**రైతులకు ముఖ్య హెచ్చరిక**

అవసరం లేకుండా పురుగుమందులు పిచికారీ చేయవద్దు. పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి, పురుగు ఉధృతి ఆర్థిక నష్టస్థాయిని దాటినప్పుడు మాత్రమే వ్యవసాయ శాఖ సిఫార్సుల మేరకు మందులు వినియోగించాలని విజయచంద్ర సూచించారు. అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించి, సరైన నీటి యాజమాన్యం పాటించాలని తెలిపారు.మందుల వివరాలు: కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగులకు ఫ్లుబెండియామైడ్/కార్టాప్ హైడ్రో క్లోరైడ్; గోధుమరంగు దోమకు బుప్రోఫెజిన్; అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్/ఐసో ప్రోథియోలేన్/అజోక్సిస్ట్రోబిన్; బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులుకు కాపర్ హైడ్రాక్సైడ్‌ను సిఫార్సు చేశారు.సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కలుపు నివారణతో పంట ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

## పచ్చని ప్రాంగణ మే ప్రగతికి ప్రతీక - పాఠశాలలో మొక్కలు నాటిన తహసీల్దార్.

**ఏన్కూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ సిహెచ్ శేషగిరి రావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ సిహెచ్. శేషగిరి రావు మాట్లాడుతూ.... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అన్నారు.పచ్చని చెట్లు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సొంత మొక్కగా భావించి సంరక్షించాలని సూచించారు. నేడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సంపదగా మారుతుందని తెలిపారు.పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఒక్క మొక్క నాటడం కాదు ఒక తరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం మా కర్తవ్యం అని ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. చందర్రావు,బి.రవి,బి.





సింగ్య, బి.శోభన్ నాయక్,పాయం శ్రీనివాస్, వి.రమేష్,డి. వెంకటరమణ, బి.శారదాబాయి, డి.ఉషశ్రీ, బి.కపూర్య, కళ్యాణి,పద్మ,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు







**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, స్థానిక నాయకులు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.మొదట కృపా కాంప్లెక్స్‌లో వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మైనంపల్లి హనుమంతరావు సందర్శించారు. ఆర్గనైజర్లు పిట్టల సాయికిరణ్, టీఎన్ఎస్ఎఫ్ సాయి, సతీష్ యాదవ్, వెంకట్ గౌడ్, భరత్ పటేల్, పరమేష్, చందు గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం కృపా కాంప్లెక్స్‌లోని శ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా దుకాణాన్ని మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెట్టిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సామ్యూల్ జాన్, శివకుమారి, రిపోర్టర్ ప్రియాంక, జయరావు తదితరులు పాల్గొన్నారు.తదుపరి ఓల్డ్ సఫిల్‌గూడలో బర్ల నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మైనంపల్లి హనుమంతరావు సందర్శించారు. వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు. గణేశ్ ఉత్సవాలు ప్రజలను ఐక్యంగా నిలిపే ఆధ్యాత్మిక, సామాజిక వేడుకలని పేర్కొంటూ, మండపాల నిర్వాహకులు



నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమక◌ుమార్, పిట్టల శ్రీనివాస్, బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్టల నాగరాజు, ఎస్ఆర్ ప్రసాద్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, సురేష్ సింగ్, పార్థసారథి, వినోద్ యాదవ్, జీడి సంపత్ గౌడ్, యూసుఫ్ భాయ్, సత్యమూర్తి, ఆశ, మంద భాస్కర్, బాల్‌రాజ్ యాదవ్, గడప దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రామవరం రెవెన్యూ పరిధిలో భూ రీ -సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

- **నెలన్నరలోగా రీ-సర్వే పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్**
- **పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలి.**



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాత నగర్–రామవరం–గరీబ్‌పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ–సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు అటవీ భూముల హద్దుల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు వెల్లడించారు.సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసివున్నందున రికార్డుల ఆధారంగా ఆయా భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. ఇప్పటికే అటవీ భూముల హద్దులు నిర్ధారించిన ప్రాంతాల్లో ఎలాంటి జాప్యం లేకుండా మిగిలిన రీ–సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే పరిధిలో పోడు సాగు భూములు ఉన్నాయని, అర్హులైన వారికి ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద హక్కులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, వారిలో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు వివరి◌ంచారు. రీ–సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమయ్యేలా, హక్కుదారులకు ప్రయోజనం కలిగే విధంగా భూ రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు.రీ–సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేసి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావు లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్స్డ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ మండలంలో శాఖల సమన్వయ కమిటీ సమావేశం

- **అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత**





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** హుస్సేన్ నగర్ బీట్ పరిధిలోని లోంక తాండలో మంగళవారం అటవీ శాఖ, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ (పంచాయతీ రాజ్), వ్యవసాయ శాఖ, మరియు విద్యుత్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ (కో-ఆర్డినేషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిరికొండ మండల తహశీల్దార్ మాట్లాడుతూ... అటవీ సంపదను కాపాడుకుంటేనే మానవ మనుగడకు రక్షణ ఉంటుందని, అనవసరంగా అడవులను నరకవద్దని ప్రజలను కోరారు. మండలాభివృద్ధి అధికారి (MPO) మాట్లాడుతూ... ప్రకృతి ప్రసాదించిన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఉన్నతాధికారులు అటవీ శాఖకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. రేంజ్ ఆఫీసర్ (FRO) K. నర్సింగరావు మాట్లాడుతూ... "భగవంతుడు ఉచితంగా ఇచ్చిన ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా మంచి గాలి, ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చు. అడవులతో పాటు జంతు సంపదను కూడా సంరక్షించుకోవాలి. చెట్లను నరకడం ఆపాలి. పోడు పట్టాలు వస్తాయనే ఆశలతో అడవులను నరికితే భవిష్యత్తులో అటువంటి అవకాశాలు ఏవీ లభించవు. కాబట్టి ప్రజలు అటవీ శాఖకు సహకరించి అడవులను, వన్యప్రాణులను కాపాడాలి" అని పిలుపునిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో సిరికొండ రేంజ్ అటవీ శాఖ సిబ్బంది మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో గంజాయి ముఠా అరెస్ట్

- **28.16 కేజీల ఎండు గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం**




**హైదరాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** నగరంలో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ముఠాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) అధికారులు దాడులు నిర్వహించారు. రెండు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం 28.16 కేజీల ఎండు గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.మల్కాజిగిరి ఆర్కే నగర్ ఆటోస్టాండ్ సమీపంలో నిర్వహించిన దాడిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బప్పాను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 7.163 కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.మరో ఘటనలో సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం సమీపంలో నిఘా పెట్టిన అధికారులు తమిళనాడు మదురైకి చెందిన ఇందు రాణి, రాజమ్మాళ్ పంజగం అనే ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిస్తున్న 21 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి తదుపరి చర్యల కోసం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, డ్రగ్స్ దందాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు

# అన్నదానం మహాదానం.





**ఏన్కూరు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** అన్ని దానాల కెల్లా అన్నదానం ఎంతో పుణ్యమ ని ఏన్కూరు ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ అన్నారు. ఏన్కూర్ మండల కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం మేడ ధర్మారావు, శ్రీ విఘ్నేశ్వర వినాయక ఏన్కూర్ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గణనాథుడికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ మాట్లాడుతూ..... యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహించటం గొప్ప విషయమని, లోక క్షేమం కోసం పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ ధర్మారావు, శ్రీ విఘ్నేశ్వర వినాయక ఏన్కూర్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

- **మద్దూర్‌లో అక్రమ నిర్మాణం తొలగింపు**





**షాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** షాబాద్ మండలం మద్దూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 111 జీఓ అమలులో ఉన్న ప్రాంతంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు మండల పంచాయతీ అధికారి (MPO) నాసరయ్య తెలిపారు.ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ అనుమతి లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నిర్మాణాలు చేపట్టే ముందు తప్పనిసరిగా గ్రామపంచాయతీ నుంచి అనుమతులు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మద్దూర్ పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 7న అమరావతిలో నూతన మండల కమిటీల జాతీయ సదస్సు



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న నూతన మండల కమిటీల జాతీయ సదస్సుకు సిరికొండ మండల కమిటీ కూడా సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. సదస్సుకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలందరూ వైట్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని నిర్ణయించారు. చిన్న సమావేశం అయినా, పెద్ద కార్యక్రమం అయినా ప్రతి కార్యక్రమంలో డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ ఉద్యమ క్రమశిక్షణ, ఐక్యతను చాటాలని నాయకులు పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ 32 ఏళ్ల ఉద్యమ చరిత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగులు, వితంతువుల పింఛన్లు తదితర ప్రజా సమస్యలపై మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఉద్యమం సాధించిన హక్కులు, విజయాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్ కార్యక్రమాల్లో మరింత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 2వ తేదీన సిరికొండ మండల కమిటీ ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ, రాబోయే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మొట్టల దీపక్ మాదిగ మాట్లాడుతూ, అక్టోబర్ 7న అమరావతిలో జరిగే నూతన మండల కమిటీల జాతీయ సదస్సుకు సిరికొండ మండల కమిటీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. ఉద్యమ క్రమశిక్షణను పాటిస్తూ ప్రతి ఒక్కరూ డ్రెస్ కోడ్‌లో పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గొర్రె గణేష్ మాదిగ, అధికార ప్రతినిధి బొడ్డు తిరుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల ప్రసాద్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు పస్కే లింగం మాదిగ, ఎంఎస్పీ ఉపాధ్యక్షుడు దాసరపు చలపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కొమ్ము సంతోష్ మాదిగ, ఎనుగంటి దిలీప్ మాదిగ, సభ్యుడు తాళ్లపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

# హెలెన్ కెల్లర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా అంతర్జాతీయ చెవిటివారి దినోత్సవం



**నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** నేరేడ్‌మెట్ డివిజన్‌లోని వివేకానందపురం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండపంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మండప నిర్వాహకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు మైనంపల్లి హన్మంతరావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఎస్ ఎన్ కంపెనీ యాజమాన్యం పై డ్రైవర్ కార్మికులు పోలీస్ లకు పిర్యాదు



**ఇల్లందు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం పరిధి లో గల కోయగూడెం oc (ఓపెన్ కాస్ట్ )ఎల్ ఎస్ ఎన్ కంపెనీ యాజమాన్యంపై కార్మికులు రెండు నెలల జీతం అలాగే 15 నెలల పిఎఫ్ ఈనెల 20 కి ఇస్తానని కంపెనీ యజమాన్యం చెప్పి ఇవ్వకపోవడంతో కార్మికులు అందరూ కలిసి ఎల్ ఎస్ ఎన్ కంపెనీ ఏజమాన్యం పై టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో అలాగే బోడు పోలీస్ స్టేషన్ లో ఇల్లందు డిఎస్పి ఆఫీసులో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది సరేనా సకాలంలో జీతాలు అందక ఎల్ ఎస్ ఎన్ కంపెనీ డ్రైవర్ కార్మికులు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఎల్ ఎస్ ఎన్ యాజమాన్యం ద్వారా త్వరగా జీతాలు ఇప్పించగలరని వారికి వినతి పత్రం అందజేశారు

## నిజామాబాద్ బస్టాండ్ లో బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్లు ప్రారంభం



**నిజామాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ,జిల్లా మహిళా సాధికారిక కేంద్రం (DHEW),బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ఆధ్వర్యంలో తల్లులు తమ శిశువులకు సౌకర్యవంతంగా,గోప్యతతో తల్లిపాలు అందించేందుకు నిజామాబాద్ బస్టాండ్ ప్రాంగణంలో బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్లు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని డిపో 1,2 డిపో మేనేజర్లు వెంకటరమణ,శ్రీనివాస్,జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య లు ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ....బస్టాండ్ కు ప్రయాణ నిమిత్తం వచ్చే తల్లులు తమ శిశువులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఈ క్యాబిన్లు ఉపయోగపడతాయని తెలిపారు.శిశువులకు తల్లిపాలు అందించడం వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని,తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణ,విద్య,ఆరోగ్యం,మహిళల సాధికారతకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.తల్లులు శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ సిడిపిఓ విజయలక్ష్మి ,ఈఓ ప్రణతి,డిహెచ్ఈడబ్ల్యూ- డిఎంసి స్వప్న,సఖి సిఏ భానుప్రియ,జెండర్ స్పెషలిస్ట్ సౌమ్య,స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షి లిటరసీ పుష్ప,అకౌంటెంట్ ఆదిత్య,సంగీత,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షన్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.



**ఏన్కూరు , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మండల కేంద్రంలో పెన్షన్ లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ కొనసాగింది. ఇందులో భాగంగా వెటర్నరీ డాక్టర్ ఆనందరావు లబ్ధిదారులను పరిశీలించి, సంబంధిత వివరాలను నమోదు చేశారు. లబ్ధిదారుల అర్హతలను పరిశీలిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ బూదూరి గాంధీ, వెటర్నరీ సిబ్బంది సుధాకర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్న వారికి పెన్షన్ అందేలా పరిశీలన చేపట్టారు.

## ఆచారి ఆశీర్వాదం తీసుకున్న నీలకంఠం పాండు

- తలకొండపల్లిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా
- బీజేపీ మండల నూతన అధ్యక్షుడు నీలకంఠం పాండు





**తలకొండపల్లి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
తలకొండపల్లి మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నీలకంఠం పాండు.. పార్టీ సీనియర్ నాయకుడు,జాతీయ నేత తల్లోజు ఆచారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సంకల్పించారు.ఈ సందర్భంగా నీలకంఠం పాండు మాట్లాడుతూ..తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తల్లోజు ఆచారి ఆశీర్వాదం, పార్టీ నాయకులు,కార్యకర్తల సహకారంతో తలకొండపల్లి మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నీలకంఠం పాండు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోరింటి నరసింహ, లక్ష్మణ్, పద్మ అనిల్, శ్రీకాంత్, విజయ్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు సర్కిళ్లకు ఒక్కరే టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్!

- సిబ్బంది కొరతతో కుదేలైన భవన అనుమతుల వ్యవస్థ..వందల దరఖాస్తులు పెండింగ్
- నాలుగు సర్కిళ్ల భారం ఒక్క మహిళా అధికారిపైనే.. పని ఒత్తిడితో సతమతం
- ఆదాయం తెచ్చే విభాగానికే అధికారులు కరువు.. ఎంఎంసీ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు
- దరఖాస్తుదారుల ప్రదక్షిణలు.. క్షేత్రస్థాయి తనిఖీలకూ ఆటంకం.. ప్రత్యేక సిబ్బంది నియామకానికి డిమాండ్




**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
పరిపాలనను వికేంద్రీకరించి.. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ, అందుకు తగ్గట్టుగా అధికార యంత్రాంగాన్ని సమకూర్చడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా భవన నిర్మాణ అనుమతులు, నిర్మాణాల పర్యవేక్షణ, నిబంధనల అమలు, అక్రమ నిర్మాణాల నియంత్రణతోపాటు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చే కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగమే సిబ్బంది కొరతతో సతమతమవుతోంది.కీసర, అల్వాల్, మౌలాలి, మల్కాజిగిరి సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ బాధ్యతలను ఒకే సూపర్‌వైజర్ పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొనడం పరిపాలనా వ్యవస్థలోని లోపాలకు అద్దం పడుతోందని ప్రజా సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. నాలుగు సర్కిళ్లు.. వందలాది దరఖాస్తులు.. అనేక క్షేత్రస్థాయి తనిఖీలు.. కానీ పర్యవేక్షణకు మాత్రం ఒక్క అధికారి! ఇదేనా ప్రజలకు సత్వర సేవలు అందించే పరిపాలనా విధానం అంటూ ప్రశ్నిస్తున్నారు.ఒక్క అధికారిపై నాలుగు సర్కిళ్ల భారం!టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మేఘనపై నాలుగు సర్కిళ్లకు సంబంధించిన పనిభారం పడిందని స్థానికులు చెబుతున్నారు. భవన నిర్మాణ అనుమతుల పరిశీలన నుంచి క్షేత్రస్థాయి తనిఖీల వరకు కీలకమైన బాధ్యతలను నిర్వహించాల్సిన ఆమెకు అన్ని సర్కిళ్ల పనులను అప్పగించడంతో తీవ్ర పని ఒత్తిడి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం, స్థలాలను తనిఖీ చేయడం, అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా పరిశీలించడం, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడం వంటి పనులను ఒకే సమయంలో నాలుగు సర్కిళ్లలో నిర్వహించడం సాధ్యమయ్యే పరిస్థితి కాదని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు.200 దరఖాస్తులు పెండింగ్.. ఎవరి బాధ్యత?టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మేఘన లాగిన్‌లో సుమారు 200 భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సంఖ్యను సంబంధిత అధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉన్నప్పటికీ.. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు మాత్రం వినిపిస్తున్నాయి.ఒక అధికారికి నాలుగు సర్కిళ్ల బాధ్యతలు అప్పగించి, అదే అధికారితో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆశించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అనుమతి కోసం నెల రోజులుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు!మల్కాజిగిరి సర్కిల్‌లో భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు నెల రోజులుగా సంబంధిత అధికారుల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. కీసర నుంచి అల్వాల్ వరకు.. మౌలాలి నుంచి మల్కాజిగిరి వరకు అధికారుల కోసం తిరగాల్సి వస్తోందని, తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటో తెలియక ఆందోళన చెందుతున్నామని చెబుతున్నారు.ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలి.. రుసుములు చెల్లించాలి.. పత్రాలు సమర్పించాలి.. కానీ పరిశీలించి నిర్ణయం తీసుకునే సిబ్బంది మాత్రం అందుబాటులో లేకపోతే ప్రజలకు సకాలంలో సేవలు ఎలా అందుతాయని ప్రశ్నిస్తున్నారు.ఆదాయం తెచ్చే విభాగానికే అధికారుల కరువు!మున్సిపల్ సంస్థలకు భవన నిర్మాణ అనుమతులు, టౌన్ ప్లానింగ్ సంబంధిత రుసుములు కీలకమైన ఆదాయ వనరుల్లో ఒకటి. అలాంటి విభాగంలో అవసరమైన స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం వల్ల ప్రజలకు సేవలు ఆలస్యం కావడంతోపాటు, దరఖాస్తుల పరిష్కారం కూడా మందగించే అవకాశం ఉందని ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు.సిబ్బంది లేక పనులు పేరుకుపోతే దాని ప్రభావం చివరకు కార్పొరేషన్ ఆదాయంపైనా పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఆదాయం సమకూర్చే విభాగాన్ని బలోపేతం చేయకుండా.. ఉన్న కొద్దిమంది సిబ్బందితోనే వ్యవస్థను నడిపించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.అధికారిపై విమర్శలు కాదు.. మానవీయంగా ఆలోచించాలి!నాలుగు సర్కిళ్ల బాధ్యతలను ఒకే మహిళా అధికారికి అప్పగించిన పరిస్థితిని మానవీయ కోణంలోనూ చూడాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఉదయం కార్యాలయాల్లో దరఖాస్తుల పరిశీలన.. మధ్యలో క్షేత్రస్థాయి తనిఖీలు.. మరోవైపు పెండింగ్ ఫైళ్లు.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు.. ఇలా అన్ని బాధ్యతలను ఒకే అధికారితో నిర్వహించడం వల్ల సహజంగానే పని ఒత్తిడి పెరుగుతుందని అంటున్నారు.సమస్య అధికారిలో కాదు.. అధికారికి తగినంత సిబ్బంది లేకపోవడంలోనే ఉందని ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఒక అధికారిని నాలుగు సర్కిళ్లకు కేటాయించి, ఫలితాలు ఆశించడం కంటే ప్రతి సర్కిల్‌కు అవసరమైన సిబ్బందిని నియమించడం ఉన్నతాధికారుల బాధ్యత అని పేర్కొంటున్నారు.ప్రజలకు సేవలా.. ప్రదక్షిణలా?భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలు తమ పని ఎప్పుడు పూర్తవుతుందో తెలియక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఏర్పడితే, పరిపాలనా వ్యవస్థ లక్ష్యం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల సమయాన్ని ఆదా చేయాల్సిన వ్యవస్థే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఎంతవరకు సమంజసం? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.ఇకనైనా మేల్కొంటారా?మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి సర్కిల్‌కు తగిన సంఖ్యలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇతర సాంకేతిక సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిష్కరించి, క్షేత్రస్థాయి తనిఖీలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.నాలుగు సర్కిళ్లు.. ఒక్క అధికారి.. వందలాది దరఖాస్తులు!సిబ్బంది కొరతను పట్టించుకోకుండా వ్యవస్థను నడిపించడం వల్ల ప్రజలపై భారం పడటమే కాకుండా, కార్పొరేషన్ ఆదాయానికీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పనిభారానికి అనుగుణంగా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యమాల నుంచి బీజేపీ మండల అధ్యక్షుడిగా.. నీలకంఠం పాండు ప్రస్థానం

- నేడు తలకొండపల్లి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా నీలకంఠం పాండు





**తలకొండపల్లి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
విద్యార్థి దశ నుంచే ఉద్యమాల బాట పట్టి.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ.. నాయకత్వం అప్పగించిన ప్రతిసారి అంకిత భావంతో పనిచేస్తున్న నీలకంఠం పాండు తల కొండపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. మండలానికి చెందిన మాజీ వార్డ్ సభ్యుడు నీలకంఠం పాండు ఏబీవీపీ, బీజేవైఎం కార్యకర్తగా పలు ప్రజా, విద్యార్థి సమస్యలపై నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. అనంతరం బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించేందుకు కృషి చేశారు.

**ఆచారి గెలుపు కోసం శ్రమ..**
కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి పాండు తనవంతు కృషి చేశారు. జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ఆయనకు మద్దతుగా ఎన్నికల కార్యక్రమాల్లో పనిచేశారు. గ్రామాలు, మండల స్థాయిలో పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు.

**సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రలో ఫుల్‌టైమర్‌గా..**
బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో నీలకంఠం పాండు ఫుల్‌టైమర్‌గా పనిచేశారు. యాత్రలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల సమన్వయంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి పార్టీ నేతల దృష్టిలో పడ్డారు. పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం అందుబాటులో ఉండటం, అప్పగించిన బాధ్యతలను చురుగ్గా నిర్వహించడం ద్వారా పార్టీలో గుర్తింపు పొందారు.

**బీసీ సామాజిక వర్గం నుంచి..**
బీసీ సామాజిక వర్గానికి చెందిన నీలకంఠం పాండు దూకుడు స్వభావంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు గ్రామస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ నిర్వహించిన నిరసనలు, ప్రజా కార్యక్రమాలు, ఉద్యమాల్లో ముందుండి పాల్గొంటూ తనదైన ముద్ర వేసుకున్నారు.





**ఆచారి గెలుపే లక్ష్యంగా..**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడంతో పాటు.. కల్వకుర్తి నియోజకవర్గంలో తల్లోజు ఆచారి నాయకత్వాన్ని బలోపేతం చేయడమే తన లక్ష్యమని నీలకంఠం పాండు తెలిపారు. ఇందుకోసం తలకొండపల్లి మండల కేంద్రంలో పార్టీ ఫుల్‌టైమర్‌గా పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, యువకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి.. బీజేపీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సమష్టిగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

- రూ.60 వేల చెక్కు అందజేసిన జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
ముఖ్యమంత్రి సహాయనిధి పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌కు చెందిన నీరుడి ఆనంద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం అందజేశారు.జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, కందాళ రాము, స్థానికులు తలగామ దర్శన్ కలిసి లబ్ధిదారుడు నీరుడి ఆనంద్‌కు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా భీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60 వేల ఆర్థిక సాయం మంజూరు చేయించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డికి నీరుడి ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందించిన సహాయానికి, తనకు అండగా నిలిచిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరం

- 3.20 లక్షల మంది ఓటర్లు.. 2.13 లక్షల నోటీసుల జారీ

**మల్కాజిగిరి , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబర్ 22 నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 418 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,20,187 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,57,577 మంది పురుషులు, 1,62,604 మంది మహిళలు, ఆరుగురు ఇతర లింగ ఓటర్లు ఉన్నారు.ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు సంబంధించి మొత్తం 2,13,141 నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 1,74,220 నోటీసులు పంపిణీ చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నోటీసులపై పరిశీలనలో భాగంగా ఇప్పటివరకు 1,09,655 విచారణలు నిర్వహించినట్లు అధికారిక వివరాలు సూచిస్తున్నాయి.ఓటర్ల వివరాల పరిశీలన, నోటీసుల పంపిణీ, విచారణల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

## పారిశుద్ధ్య సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం

- 90 మంది కార్మికులకు భద్రతా సామగ్రి.. బిల్ కలెక్టర్లకు 8 ట్యాబ్‌లు

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అలియాబాద్ మున్సిపాలిటీ ప్రాధాన్యం ఇస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన రక్షణ సామగ్రి అందించడంతోపాటు, మున్సిపల్ సేవలను మరింత సాంకేతికతతో అనుసంధానం చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మంగళవారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 90 మంది పారిశుద్ధ్య సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, గౌజులు, రైన్‌కోట్లు తదితర భద్రతా సామగ్రిని పంపిణీ చేశారు. విధి నిర్వహణలో వాతావరణ పరిస్థితులు, పారిశుద్ధ్య పనుల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని రక్షణ పరికరాలు అందించడం ద్వారా కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.ఇదే కార్యక్రమంలో మున్సిపల్ బిల్ కలెక్టర్లకు భువన్ సర్వే, కార్యాలయ సంబంధిత పనుల నిర్వహణ కోసం ఎనిమిది ట్యాబ్‌లను అందజేశారు.





సాంకేతిక పరికరాల వినియోగంతో క్షేత్రస్థాయి వివరాల సేకరణ, సర్వే ప్రక్రియ, కార్యాలయ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అత్యంత కీలకమన్నారు. ఎండ, వర్షం, ఇతర ప్రతికూల పరిస్థితుల్లోనూ విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. విధి నిర్వహణకు అవసరమైన రక్షణ సామగ్రిని అందించడంతోపాటు, వారికి అందాల్సిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమని అన్నారు. పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న సిబ్బందికి అవసరమైన సహకారం అందించడంతోపాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.మున్సిపల్ కమిషనర్ ఎన్.వె ◌ంకటరెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మాస్కులు, గౌజులు, రైన్‌కోట్లు తదితర రక్షణ పరికరాలను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. పారిశుద్ధ్య పనుల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ఏర్పాట్లు

- డిండి ప్రాజెక్టు వద్ద అధికారులతో కలిసి పరిశీలించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం





**డిండి( గుండ్లపల్లి ) , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిండి ప్రాజెక్టు (చెరువు) వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు దేవరకొండ డీఎల్‌పీఓ శంకర్ నాయక్, డిండి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణలతో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశంలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రతా చర్యలు, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ నల్లగంతుల రవి, గ్రామ కార్యదర్శి జంగయ్య, ఉప సర్పంచ్ కౌసర్ రషీద్, వార్డు సభ్యులు భూషిపాక బాలయ్య, గుర్రం సురేష్, మాకం సైదులు, ఫిషరీస్ ఫీల్డ్‌మెన్ మూడావత్ రాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథుని శోభాయాత్ర

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :**
వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని ఉప్పరపల్లిలో అంబేద్కర్ వారియర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యూత్ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సీఐ కొండా నర్సింహారెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అంబేద్కర్ వారియర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



కత్తి రమేష్, అంబేద్కర్ వారియర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఎలకూర్తి నరేశ్, ప్రవీణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తె.యూ.గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్.యల్.జ్యోత్స్న



**నిజామాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు ఆదేశాల మేరకు గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా గతంలో సేవలందించిన డాక్టర్.యల్.జ్యోత్స్న ను మరోసారి వార్డెన్‌గా నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం.యాదగిరి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ పునర్నియామకం పట్ల అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్థులు జ్యోత్స్న కు అభినందనలు తెలియజేశారు.

## ఉమ్మడి జిల్లా కబడ్డీలో మంథని గురుకుల విద్యార్థుల సత్తా



**మంథని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ ఆటలో మంథని పట్టణానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు) విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థులను మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయ సంస్థ అధికారి, ప్రిన్సిపల్ ఊటూరి శ్రీనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో చదువుతోపాటు ఆటల పైన ఆసక్తి కనబరిచాలని తెలిపారు. ఆటలు శారీరకంగా మానసికంగా మరింత దృఢంగా చేయడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి జీవితంలో పైకి రావాలని తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని, అందుకు కారణమైన పీడి రమేష్, పిఈటి పుష్పలతలను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, పాఠశాల/కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోర్గాం(పీ) లో వైభవంగా గణేష్ నిమజ్జనం.. పాల్గొన్న ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

- **వాహనం వద్ద ప్రత్యేకంగా పూజలు**
- **శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే**





**నిజామాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోర్గాం (పీ)లో గణేశ్ నిమజ్జన వేడుకలు మంగళవారం వైభవంగా చేపట్టగా..నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గణపయ్యను ప్రత్యేకంగా అ ల ంక రించిన వాహనంలో ఉంచి శోభాయాత్ర చేపట్టగా..ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు.అటు నిమజ్జన వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యే కు మండప నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు సాదరంగా ఆహ్వానం పలికారు.అనంతరం ఎమ్మెల్యే స్థానిక భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ.. సందడి చేశారు.ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి రమేష్,ముప్ప గంగారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా విలేకరి శైలిలో, ప్రధాన అంశాన్ని ముందుకు తెచ్చేలా సవివరంగా రూపొందించాను.

- **ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థులకు బహుమతులు**
- **సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శామీర్‌పేట్ మండల పరిధిలోని సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పరీక్షలు, వివిధ విద్యా, పాఠ్యేతర కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ప్రతినిధులు అనూష, లలిత విద్యార్థులకు బహుమతులతో పాటు పరీక్షా ప్యాడ్లు, ఆంగ్ల చేతిరాత పుస్తకాలను అందజేశారు.విద్యార్థులు చదువుతో పాటు వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు, వారి ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిడి వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం సంతోషకరమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ప్రతినిధులు అనూష, లలితలకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.మురళీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- **మాతృ, శిశు ఆరోగ్య సమాచారంలో జాప్యం, తప్పిదాలకు తావులేకుండా చూడాలి: డా. కె. ఆనంద్**





**మేడ్చల్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మాతృ, శిశు ఆరోగ్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి స్థాయిలో, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ అధికారులను ఆదేశించారు. మాతృ ఆరోగ్య పరామితులు, ప్రసవ వివరాలు, శిశు ఆరోగ్య సూచికలకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో సేకరించిన రికార్డులతో సరిచూసుకుని పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో వివరాల నవీకరణ, పర్యవేక్షణ, డేటా నాణ్యతపై సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ ఆరోగ్య కేంద్రాలకు చెందిన డీఈఓలు, ఏసీసీలు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ.. పోర్టల్‌లో నమోదు చేసే ప్రతి వివరాన్ని బాధ్యతగా పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని సంబంధిత రికార్డులతో సరిపోల్చిన అనంతరం మాత్రమే పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, ప్రసవానికి సంబంధించిన వివరాలు, శిశువుల ఆరోగ్య సూచికలు వంటి కీలక సమాచారంలో ఎలాంటి తప్పులు, అసంపూర్ణతకు అవకాశం ఇవ్వకూడదన్నారు.పోర్టల్‌లో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వివరాలను వెంటనే పూర్తి చేయాలని, గతంలో నమోదైన సమాచారంలో తప్పులు లేదా అసంపూర్ణ వివరాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో డేటా నమోదును నిరంతరం పర్యవేక్షించాలని, సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ డేటా నాణ్యతను మెరుగుపరచాలని డీఈఓలు, ఏసీసీలు, సూపర్‌వైజర్లకు సూచించారు.మాతృ, శిశు ఆరోగ్య సేవల అమలు, పర్యవేక్షణలో ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో నమోదయ్యే సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని డా. కె. ఆనంద్ పేర్కొన్నారు. భవిష్యత్ సమీక్షలు, ఉన్నతాధికారుల పరిశీలనకు పోర్టల్‌లోని సమాచారం ఆధారంగా ఉంటుందని తెలిపారు. అందువల్ల డేటా సమగ్రత, ఖచ్చితత్వం, సమయానుకూల నవీకరణలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.సమాచారం నమోదు చేసే సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయి రికార్డులు–పోర్టల్ వివరాల మధ్య వ్యత్యాసాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. మాతృ, శిశు ఆరోగ్య సేవల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరిగేలా డేటా నిర్వహణ వ్యవస్థను పటిష్టం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## టీఎన్జీవో కార్యాలయంలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** టిఎన్జీవో ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన....ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా టిఎన్జీవో కార్యాలయంలో టిఎన్జీవో గణేష్ మండలి మట్టి గణపతిని ప్రతిష్ఠించుకుని,నవరాత్రులు శ్రద్ధలతో పూజలు,భజనలు నిర్వహించి,చివరి రోజైన మంగళవారం మహిళా ఉద్యోగ సోదరీమణులందరి చే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి,అనంతరం నిత్యపూజ,ఉత్తర పూజా కార్యక్రమాలు,గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుని,మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఇట్టి ఆధ్యాత్మిక కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పక్షాన అదనపు కలెక్టర్ భుజంగ రావు,ట్రెజరీ శాఖ జెడి,జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ,టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్,రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చుకూరి సతీష్,జిల్లా ఉపాధ్యక్షులు సంజీవయ్య,జాఫర్ హుస్సేన్,కేపీ సునీత,శివకుమార్,పద్మ,గంగా రాజు,గీతారెడ్డి,విజయలక్ష్మి ,సునీల్,స్వామి,మంగారెడ్డి,గురు చరణ్,వినయ్ రాజ్,అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్,మారుతి,రూరల్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్,ఆర్మూర్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు శశికాంత్ రెడ్డి,విశాల్,భీమ్గల్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు సృజన్ కుమార్,సాయికుమార్ గౌడ్,సర్వే స్పెషల్ యూనిట్ అధ్యక్షులు సూర్య ప్రకాష్ అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు,క్లాస్ ఫోర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేరేళ్ల శ్రీనివాస్,బీరేందర్ సింగ్,టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ జిల్లా ఉద్యోగులు మహిళా ఉద్యోగ సోదరిమణులు అధిక సంఖ్యలో హాజరై టీఎన్జీవో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఆటపాటలతో,కోలాటాలతో,నృత్యాలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# వాసవీ మాత ఆలయంలో ఘనంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

- **నాలుగు రోజులుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ**







**మల్కాజిగిరి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగు రోజులుగా ప్రతిరోజూ సుందరకాండ పారాయణం నిర్వహిస్తూ భక్తులను ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసిన నిర్వాహకులు, కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణం చేశారు. ఆలయ ప్రాంగణం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పారాయణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. సుందరకాండ పారాయణంతో ప్రారంభమైన నాలుగు రోజుల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ముగింపు సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తుల ఆధ్యాత్మిక భావనలకు అనుగుణంగా కార్యక్రమాలను కొనసాగించారు. హనుమంతుడి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి మల్కాజిగిరి, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు సుందరకాండ పారాయణం, అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# భూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

- **ఉప్పట్ల కేసారం, రాజాపూర్‌లో పర్యటించిన కోయ శ్రీహర్ష**



**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించి క్షేత్రస్థాయి భూ సమస్యలను పరిశీలించారు.మంగళవారం రామగిరి మండలంలోని ఉప్పట్ల కేసరం గ్రామంలోని భూములను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని రాజాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి భూ నిర్వాసితులతో సమావేశమై వారితో మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉప్పట్ల కేసారం సర్వే నంబర్ 35 లోని ప్రభుత్వ భూమి స్థలాన్ని పరిశీలించామని, ప్రభుత్వ భూమికి సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.బుధవారం పేటకు సంబంధించి సింగరేణి సంస్థ భూసేకరణలో భాగంగా ప్రాజెక్ట్ రిపోర్టు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల అభ్యంతరాలు, వారి అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే భూ సేకరణ పై తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డిసిపి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, తహసిల్దార్ సుమన్,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# టీజేజేఏసీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా చేరాల రవీందర్

- **జర్నలిస్టులకు గవర్నర్ కోటాలో మూడు ఎమ్మెల్సీలు ఇవ్వాలి: రాష్ట్ర చైర్మన్ తొగరి కరుణాకర్**




**మంథని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** తెలంగాణ జర్నలిస్టు జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేజేఏసీ) విస్తరణలో భాగంగా పలు జిల్లాల నూతన అధ్యక్ష, కార్యవర్గాలను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. రాష్ట్ర చైర్మన్ తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా చేరాల రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు జిల్లాల అధ్యక్షులు మరియు నాలుగు ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మందుల బాలకృష్ణ నియామకం కాగా.. భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండం నాగరాజు, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాజా గౌస్ ఉద్దీన్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనగందుల సతీష్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాయికిని జనార్దన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ తొగరి కరుణాకర్ మాట్లాడుతూ.. సమాజ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులకు తగిన గుర్తింపు, న్యాయం జరగడం లేదన్నారు. వివిధ రంగాలకు శాసనమండలిలో ప్రాతినిధ్యం ఉన్నట్లుగానే, జర్నలిస్టుల సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించేందుకు వీలుగా గవర్నర్ కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థకాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సాధనే లక్ష్యంగా జర్నలిస్టులందరూ టీజేజేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. త్వరలో హైదరాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన 'జర్నలిస్టుల సమరభేరి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ తొగరి కరుణాకర్ రాష్ట్ర నాయకత్వానికి చేరాల రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**మంథని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** గణపతి నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంథని గోదావరి పరిసరాల్లో మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిమజ్జన దారిని సౌకర్యవంతంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నిమజ్జన దారిలో స్టోన్ డస్ట్ పోయించారు.మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, కమిషనర్ ఎన్. మనోహర్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి కలిసి గోదావరి పరిసరాలను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన వీధి దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సహాయం తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.నిమజ్జన సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

# హెడ్ కానిస్టేబుల్ శంకరయ్యకు ఏఎస్ఐగా పదోన్నతి



**వికారాబాద్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శంకరయ్యకు సహాయ ఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా పదోన్నతి ధ్రువపత్రాలను అందజేసి శంకరయ్యను అభినందించారు. పదోన్నతి అనంతరం మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ పేదలు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం, మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ముందుండాలని ఎస్పీ పేర్కొన్నారు.కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందిన శంకరయ్య ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుల్కచర్ల పోలీసు సిబ్బంది శంకరయ్యను అభినందించి ఘనంగా సన్మానించారు.

# పినపాక మండలంలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్




**పినపాక, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** పినపాక మండలం సున్నంవారి గూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్న ప్రాంతాల్లో రికార్డుల ఆధారంగా భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు, రైతులతో మాట్లాడి రీ-సర్వేకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సర్వేయర్ నరేష్, జిపిఓలు, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమ పూజ మహోత్సవం.



**పినపాక, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** హిందూ సంప్రదాయంలో కుంకుమ పూజకు ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. కుంకుమ పూజ కేవలం ఆచారమే కాకుండా భక్తికి, శక్తికి, సౌభాగ్యానికి ప్రత్యేకగా నిలుస్తుందనే నమ్మకంతో మహిళలు ఆచరించే పూజా విధానం. గణపతి నవరాత్రుల వేడుకల్లో భాగంగా పినపాక మండల కేంద్రంలోని వినాయకుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళల చేత భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ మహోత్సవాన్ని పూజారి పత్రి వినోద్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కుంకుమ పూజ కోసం వచ్చిన మహిళ భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించి కుంకుమ పూజ నిర్వహించే విధానాన్ని, తద్వారా వచ్చే సత్ఫలితాలను వివరించారు. కుంకుమ పూజతో అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని, కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం కలుగుతుందని, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవిస్తారని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతను పెంపొందించేలా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలు అందజేశారు.అనంతరం సామూహిక హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తి గీతాలు, మంగళహారతులతో మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఉత్సవ సందడి మరింత పెరిగింది.

## దుర్గా నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ





**దిల్సుక్నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** దిల్సుక్నగర్ దుర్గా నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2500 మంది భక్తులు విచ్చేసి ఈ అన్న ప్రసాద స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా దుర్గా నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారని ఈ ఏడాది కూడా గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు దుర్గా నగర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ తెలిపారు. ఈ దుర్గ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని బిజెపి ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సామ రంగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా సురేష్ యాదవ్ ,వినోద్ కుమార్, సామ రంగారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ... దుర్గా నగర్ యూత్ అసోసియేషన్ వారు గత కొన్ని సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని ఎల్లవేళలా ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు వారిపై ఉండాలని అలాగే ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలపై కూడా ఉండాలని ఆకాంక్షించారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా ముందస్తు బైండోవర్ చర్యలు : పోలీస్ కమీషనర్ వెల్లడి

- **జిల్లా వ్యాప్తంగా 572 మంది బైండొవర్**



**నిజామాబాద్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి,పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం సంబంధిత మండల రెవెన్యూ అధికారులు (తహసీల్దార్లు/MROలు) ఎదుట హాజరుపరిచి,చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టారు.వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు,ఘర్షణలు,అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.నిమజ్జన మార్గాలు,ప్రధాన కూడళ్లు,సున్నితమైన ప్రాంతాలు,రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి,నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.అలాగే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా,క్రమశిక్షణతో,పరస్పర సహకారంతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని,వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు.

- నిజామాబాదు డివిజన్ వ్యాప్తంగా 280 మంది బైండోవర్.
- ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 175 మంది బైండోవర్.
- బోధన్ డివిజన్ వ్యాప్తంగా 117 మంది బైండోవర్.జిల్లా వ్యాప్తంగా 572 మందిని బైండొవర్ చేశారు.

## సీజనల్ వ్యాధుల వేల వైద్యం కరువు!
## :పినపాక ఆరోగ్య కేంద్రంలో కనిపించని సిబ్బంది

- **రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలని గ్రామస్తులు డిమాండ్**








**పినపాక, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** పినపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ, వైద్యం కోసం వస్తున్న సామాన్య ప్రజలకు సిబ్బంది లేకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీస వైద్య సేవలు అందక, దిక్కుతోచని స్థితిలో వెనుదిరగాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది.

**ఎమ్మెల్యే హెచ్చరించినా... పత్రికల్లో కథనాలు వచ్చినా మారని తీరు!**

గతంలో స్థానిక ఎమ్మెల్యే స్వయంగా వైద్య సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విధుల్లో బాధ్యతాయుతంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, కొన్ని ప్రముఖ వార్తా పత్రికల్లో ఆస్పత్రి దుస్థితిపై ప్రత్యేక కథనాలు ప్రచురితమైనప్పటికీ, ఇక్కడి సిబ్బంది తీరులో ఎలాంటి మార్పు రాకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి, తీవ్ర అసహనానికి గురిచేస్తోంది.

**సీజనల్ వ్యాధుల వేళ రోగుల అవస్థలు:**

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు వైద్యం అందించాల్సిన బాధ్యతను సిబ్బంది గాలికొదిలేశారు. "ఎప్పుడు వచ్చినా మాకేంటి? ఎవరి ప్రాణాలు పోతే మాకేంటి?" అన్న చందంగా వారి ప్రవర్తన ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఆస్పత్రికి వచ్చినా వైద్యం అందనప్పుడు ఇక ఈ ఆసుపత్రి ఉంటే ఏంటి... లేకపోతే ఏంటి?" అని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా?**

జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడం, సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని తెలుస్తోంది. అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని సిబ్బంది యథేచ్ఛగా విధులకు గైర్హాజరవుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్: బూర సురేష్ పినపాక బీఆర్ఎస్ నాయకులు**

అత్యవసర వైద్యం అందక ఏ క్షణంలో ఏ ప్రాణం పోతుందోనని పినపాక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయాలని బూర సురేష్ , పినపాక బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజలకు సరైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

- **నామినేటెడ్ పదవుల్లో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాలి**



**వికారాబాద్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ సోషల్ మీడియా మండల సమన్వయకర్త కొమ్ము శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండ్లగూడ వైన్స్ హత్య కేసులో మరో ముగ్గురు అరెస్ట్

- **బండ్లగూడ వైన్స్ హత్య కేసులో పరారీలో ఉన్న ఉమా మహేష్ సహా ముగ్గురు పట్టివేత**



**నాగోల్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ నయీమ్ హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె. ఉమా మహేష్ @ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా @ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమా మహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు.బాల్య స్నేహితుల మధ్య విభేదాలునయీమ్, ఉమా మహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి.కొంతకాలంగా రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో తిరిగేవారు. నయీమ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు పెరిగి ఒకరిపై ఒకరు కక్ష పెంచుకున్నారు.ఖమ్మంలో పథకం.. హైదరాబాద్‌లో హత్య నయీమ్‌ను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. మరుసటి రోజు ఖమ్మం నుంచి కారులో హైదరాబాద్‌కు చేరుకున్న నిందితులు.. మున్నా ద్వారా నయీమ్‌కు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు.బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్ ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లారు.వైన్స్ వద్ద నయీమ్ కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. సిట్టింగ్ ఏరియాలో వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది.ప్రత్యేక బృందాలతో గాలింపు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్.బి.నగర్ డీసీపీ శ్రీమతి బి. అనురాధ ఐపీఎస్, ఎల్.బి.నగర్ ఏసీపీ శ్రీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసులు.ప్రధాన సూత్రధారి ఉమా మహేష్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# బోనకల్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తిభావం తో వినాయక నవరాత్రి ఉత్సవాలు

- **తొమ్మిదో రోజు ప్రత్యేక పూజల్లో కోణతాలపల్లి నాగేశ్వరరావు–కృష్ణవేణి, సుగ్గల వెంకట వీర బ్రహ్మాంజనేయులు–శ్రావణి దంపతులు**
- **తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు..**



**బోనకల్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** బోనకల్ మండల కేంద్రంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగ్గయ్యపేట రోడ్డులో కలవల వెంకట లక్ష్మీనారాయణ, సుబ్బారావు ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఉదయం నుంచే భక్తులతో సందడిగా మారింది. వేద మంత్రోచ్ఛారణలు, గణనాథుని నామస్మరణలతో మండపం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలుతొమ్మిదో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కోణతాలపల్లి నాగేశ్వరరావు–కృష్ణవేణి దంపతులు, సుగ్గల వెంకట వీర బ్రహ్మాంజనేయులు–శ్రావణి దంపతులు పీఠాలపై ఆసీనులై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పురోహితుల సూచనలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, గణనాథునికి పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.వేద మంత్రోచ్ఛారణల మధ్య సాగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. విఘ్నేశ్వరునికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి, ప్రత్యేక హారతులు నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఆయురారోగ్యాలు, గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, బోనకల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని గణనాథుని ప్రార్థించారు.ఏటా ఘనంగా గణేష్ ఉత్సవాలుబోనకల్ మండల కేంద్రంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక భక్తులు, యువత, మహిళలు, దాతలు, వివిధ వర్గాల ప్రజల సహకారంతో ఉత్సవాలను సమష్టిగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ ఏడాది కూడా తొమ్మిది రోజుల పాటు గణనాథునికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించేలా శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.నిమజ్జన మహోత్సవానికి ఏర్పాట్లుతొమ్మిది రోజుల పాటు కొనసాగిన ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.నిమజ్జన కార్యక్రమానికి ముందు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి గణనాథునికి వీడ్కోలు పలకనున్నట్లు శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజులుగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు నిమజ్జన వేడుకల్లోనూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.ఉత్సవాల నిర్వహణలో కమిటీ సభ్యుల సమన్వయంశ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కలవల వెంకట సుబ్బారావు, కలవల బాబు, యిమ్మడిశెట్టి రాము, అమరేశి సాయి కుమార్, రామారావు మేస్త్రి, కృష్ణా మేస్త్రి, బంధం దుర్గారావు, ఎలక్ట్రీషియన్ సాయి, గంగాధరి కృష్ణ, పాండురంగారావు, నరేందర్, ఫ్యాన్సీ షాప్ సాయి, బ్రహ్మాంజనేయులు, కూడుపుగంటి కృష్ణ, నాగేశ్వరరావు, కాలసాని పరశురామ్, గెల్లా ఉదయ్ తదితరులతో పాటు మహిళలు కీలకంగా పాల్గొంటున్నారు.పూజా కార్యక్రమాల ఏర్పాట్లు, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, మండపం వద్ద అవసరమైన ఏర్పాట్లను శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించారు. ఉత్సవాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగేందుకు స్థానికుల సహకారం అందుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.భక్తులతో కిక్కిరిసిన మండపంతొమ్మిదో రోజు ప్రత్యేక పూజలకు బోనకల్ సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు, యువత, వృద్ధులు కుటుంబ సమేతంగా గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. గణనాథుని నామస్మరణలు, భక్తిగీతాలతో మండపం పరిసర ప్రాంతం మార్మోగింది. భక్తుల రాకతో బోనకల్ కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.“వక్రతుండ మహాకాయ” అంటూ భక్తుల నామస్మరణలు, వేద మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజలతో తొమ్మిదో రోజు వినాయక ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు భక్తులను అలరించిన గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు బుధవారం జరిగే నిమజ్జన మహోత్సవంతో ఘనంగా ముగింపు పలకనున్నారు.

# బీజేపీ బలోపేతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు, తిరుమణి రవి గౌడ్



**తలకొండపల్లి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** గత ఆరు సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేసే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ మాజీ మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తనను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పార్టీ పెద్దలకు, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆరు సంవత్సరాల పదవీకాలంలో పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో తనకు అండగా నిలిచి, పార్టీ బలోపేతానికి సహకరించిన మండల కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, బూత్ స్థాయి నాయకులు, పార్టీ పెద్దలు, మిత్రులు, పత్రికా–మీడియా మిత్రులు, శ్రేయోభిలాషులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ కోసం తనకు సహకరించిన ప్రతి ఒక్కరి మద్దతు, ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువలేనని తిరుమణి రవి గౌడ్ పేర్కొన్నారు.భవిష్యత్తులోనూ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

# 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



**మంథని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మంథని 108 అంబులెన్స్‌ను పెద్దపల్లి జిల్లా ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కుమారస్వామి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, మందులను పరిశీలించారు. అలాగే అంబులెన్స్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.అత్యవసర సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కుమారస్వామి సూచించారు. అంబులెన్స్‌లో అవసరమైన మందులు, పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.ఈ తనిఖీలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంశీధర్‌రెడ్డి, పైలట్ హబీబ్ పాల్గొన్నారు.

# కరకగూడెం హత్యాయత్నం కేసు ఛేధన : నలుగురి అరెస్ట్



**పినపాక, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** కొన్ని రోజుల క్రితం కరకగూడెం మండలం ఆదివాసి గ్రామమైన అశ్వాపురంపాడు గ్రామ శివారులో ఉన్న ఫారెస్ట్ ప్లాంటేషన్ వద్ద అశ్వాపురంపాడు గ్రామానికి చెందిన వజ్జా భీమరాజు అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసి మెడ పైన తల పైన విచక్షణారహితంగా గాయపరిచిన సంగతి విధితమే కరకగూడెం పోలీసులు చాకచక్యంతో కేసు చేదించారు. నలుగురు వ్యక్తులని మంగళవారం అదుపులకు తీసుకొనడం జరిగింది . అదుపులోకి తీసుకున్న వ్యక్తుల పేర్లు కోవాసి బాలకృష్ణ, పోడియం విజయ్ , కోవాసి సంతోష్ , పోడియం మంగయ్య , అని నలుగురు వ్యక్తులు గతంలో వాళ్ల ఊరు పెద్దమనిషి అయినా వెంకటేశ్వర్లు మొదటి ముద్దాయి వాళ్ల నాన్న చంపబడినందుకు అతను చంపిన వ్యక్తి భీమరాజు అని జైలు నుంచి విడుదల కాగానే ఈ నలుగురు మాట్లాడుకుని అతనిని అడవిలో పశువుల మేపటానికి వెళ్లగా అతని వెంబడించి కత్తులతో నరికి అక్కడ నుంచి వెళ్ళిపోయినారు మంగళవారం నలుగురు నేరస్థుల్ని కరకగూడెం పోలీసులు వారిని రిమాండ్ కి తరలించారు కార్యక్రమంలో ఏడుల్లా బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేయాలి

- మహావీర్ వైద్య కళాశాల యాజమాన్యానికి ఎస్ఎఫ్ఐ, సీపీఎం డిమాండ్



**వికారాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వికారాబాద్: మహావీర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థి రోహన్ ఖాన్‌పై తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి దాడి చేసి అవమానించడం తీవ్రంగా ఖండిస్తున్నామనీ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఎం నాయకులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల మధ్య ప్రాంతీయ విభేదాలను అరికట్టి కళాశాలలో ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. ర్యాగింగ్, దాడులకు అడ్డుకట్ట వేసేందుకు బాలుర, బాలికల వసతి గృహాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. 300 మందికి పైగా విద్యార్థులకు ర్యాగింగ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజా బాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ కోరారు.దాడుల నేపథ్యంలో మహారాష్ట్రకు వెళ్లిన రోహన్ ఖాన్ కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి కళాశాలకు వచ్చాడు. తన కుమారుడిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు కళాశాల యాజమాన్యాన్ని కోరారు.

# బంజారా కాలనీలో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** హయత్ నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో దాదాపు రూ.6 కోట్ల రూపాయలతో, మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారి హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా స్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణ నాణ్యత, మౌలిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా అవసరమైన చర్యలపై చర్చించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో UBD మల్కాజ్గిరి మేనేజర్ సునంద,డైరెక్టర్ లోకేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ కాలనీలో ఘనంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు.



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** భద్రాచలం: పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రాచలం సూర్య హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ పవన్ రెడ్డి, శ్రీమతి గీత పావని దంపతులు శ్రీ విఘ్నేశ్వర గణనాథుని పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ గణపతి హోమం నిర్వహించనున్నారు. ఆదివారం గణనాథునికి 108 రకాల నైవేద్యాలతో మహా నైవేద్య సమర్పణ కార్యక్రమం చేపట్టనున్నారు. సోమవారం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితర కాలనీవాసులు సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో వడ్డీపర్తి హరి కృష్ణ, కేతవరపు రామకృష్ణ, భూక్యా రంగా, తదితరులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్స్‌లో 425 కిడ్నీ మార్పిడుల మైలురాయి



**శంషాబాద్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విభాగం మరో కీలక మైలురాయిని సాధించింది. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి నేతృత్వంలోని వైద్య బృందం ఇప్పటివరకు 425 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ.. రక్త గ్రూపులు సరిపోని కేసుల్లోనూ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరైన వైద్య విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన వైద్య బృందం ద్వారా క్లిష్టమైన కేసుల్లోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. కిడ్నీ మార్పిడికి వయసు కూడా తప్పనిసరి అడ్డంకి కాదని వైద్యులు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు సైతం అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. డాక్టర్ మురళీనాథ్ వుక్కడాల మాట్లాడుతూ.. డయాలసిస్ కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు చికిత్సలో ముఖ్యమైన విధానమైనప్పటికీ, అనుకూలమైన రోగుల్లో కిడ్నీ మార్పిడి దీర్ఘకాలిక చికిత్సా మార్గంగా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన 425 ట్రాన్స్‌ప్లాంట్లు అనేక కుటుంబాలకు కొత్త ఆశను అందించాయని పేర్కొన్నారు. రక్త గ్రూపులు భిన్నంగా ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో కిడ్నీ మార్పిడి సాధ్యమవుతుందనే విషయంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికత, ప్రత్యేక నెఫ్రాలజీ మరియు ట్రాన్స్‌ప్లాంట్ సేవలతో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో కిడ్నీ మార్పిడి సేవలను విస్తరిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

# నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ఘనంగా ప్రారంభోత్సవం చేసిన తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,





**నాగోల్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** జంగారెడ్డి కాలనీ వాసుల ఆరోగ్యం, శారీరక దృఢత్వం, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడంలో ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ వ్యాయామం చేసుకునేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి అవసరమైన సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డి కాలనీ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, సెక్రటరీ వెంకన్న గౌడ్ తదితరులు, కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలి కలెక్టర్ కుష్బూ గుప్త

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మహిళలు తమలోని నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకుంటూ, పరస్పర సహకారంతో ముందుకు సాగి ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ కుష్బూ గుప్త పిలుపునిచ్చారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ ఫస్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రంలో మహిళలు, విద్యార్థులకు అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఐదు విభాగాల్లో ఉచితంగా అందిస్తున్న శిక్షణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, శిక్షణ ద్వారా వారికి కలిగే ప్రయోజనాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే ఎన్ఎం శ్రీనివాసరెడ్డి చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కళారూపాలను ఆమె తిలకించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ రూపొందించిన కళాకృతులను చూసి కలెక్టర్ వారిని అభినందించారు.మహిళలు శిక్షణ ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. మహిళల ఆర్థిక సాధికారతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.



# ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా ఎల్లంపల్లి యాదగిరి, జిల్లా అధ్యక్షులుగా దొండ దుర్యయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి. రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.కె. జానిమియా, కోశాధికారిగా గుమ్మడవల్లి సంతోష్ కుమార్ ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు రేషన్ డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని రేషన్ డీలర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. డీలర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సంఘం ఐక్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు."రేషన్ డీలర్ల సంక్షేమమే లక్ష్యంగా డీలర్ల ఐక్యతే బలం" అనే నినాదంతో నూతన కార్యవర్గం ముందుకు సాగాలని డీలర్లు ఆకాంక్షించారు.



నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
బుధవారం | హైదరాబాద్
23 - 09 - 2026
www.netisubhodaya.com



# ఏదులాపురం ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

- నాణ్యతలో రాజీ పడొద్దు
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనుల ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తరుణీ హట్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ భవన సముదాయం అందుబాటులోకి వస్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట లభిస్తాయని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్ష

- పలు గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు్దు
- అన్నదాన కార్యక్రమాలు ప్రారంభం
- ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించుకోవాలని సూచన





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** విఘ్నాలను తొలగించే ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి.. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.--- పలు మండపాల్లో పూజలుకూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం, గురవాయిగూడెం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద మారుతినగర్, ఖమ్మం నగరంలోని బేడ జంగాల కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంత్రి సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.--- ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలి గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లుగానే నిమజ్జన కార్యక్రమాలను కూడా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. భక్తులందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోక బత్తిని అనిత, వైస్‌చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ లో కరువుపై మీనమేషాలు లెక్కిస్తున్న సర్కార్



**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** సెప్టెంబర్ నెలతో ఖరీఫ్ సీజన్ ముగుస్తుండగా కరువు గుర్తింపునకు కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం అన్యాయమని చెప్పక తప్పదు. రోజు రోజుకు దుర్భిక్షం తీవ్రత అంతకంతకూ ఎక్కువవుతున్న నేపథ్యంలో కరువు సహాయక చర్యల కోసం ప్రతిపక్షాలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాలు ఆందోళన బాట పట్టాక, ఇప్పుడు తీరిగ్గా అక్టోబర్ లో నైనా కరువు మండలాలు ప్రకటించాలని అధికారులను, ముఖ్యమంత్రిని కోరుతున్నారు. ఇప్పటి దాకా ఎల్‌నినో ప్రభావంపై మొక్కుబడి సమీక్షలకే ప్రభుత్వం పరిమితమైంది మినహా నిర్దిష్టమైన కార్యాచరణ, నిధుల కేటాయింపు చేయకపోవడంతో అధికారులూ అంతే మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంవత్సరం ఎల్‌నినో వలన రుతుపవనాలు విఫలమవుతాయని, వర్షాభావం నెలకొంటుందని వాతావరణ శాఖ తొలకరి కంటే ఎంతో ముందుగానే హెచ్చరించింది. ఎల్‌నినో ప్రభావం ఏడాదంతా కొనసాగుతుందని, ఇంకా ఇంకా ఉధృతమవుతుందని, అందుకు తగ్గట్టు ప్రభుత్వాలు సన్నద్ధం కావాలని ఐక్యరాజ్య సమితి అనుబంధ ప్రపంచ వాతావరణ సంస్థ ఒకటికి రెండు మార్లు అప్రమత్తం చేసింది. ఈ హెచ్చరికను అటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లైట్ తీస్కుని ప్రజలను గాలికొదిలిశాయి. ఉపద్రవం ముంచుకొచ్చాక సన్నాహక చర్యలంటూ సన్నాయి నొక్కులు నొక్కడం అభ్యంతరకరం. నైరుతి రుతుపవనాలు రాజస్థాన్ నుంచి తిరోగమన దిశ పట్టాయన్న ఐఎండి, ఈ కాలంలో సగటున 15 శాతం లోటు వర్షపాతం నమోదైందని పేర్కొంది. దక్షిణ ద్వీపకల్పంలో ఏకంగా 29 శాతం తక్కువ వర్షం పడిందని విశ్లేషించింది. కాగా తెలంగాణ లో వర్షపు లోటు 50-55 శాతం ఉంది. దేశంలోకెల్ల మన రాష్ట్రంలోనే కనిష్ట వర్షపాతం నమోదైంది. పరిస్థితి ఇంత దుర్భరంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పందన పేలవంగా ఉంది. సీజన్ మొత్తమ్మీద ఒక్కటంటే ఒక్క జిల్లా కూడా సాధారణ వర్షానికి నోచుకోకపోవడం గడచిన మూడు దశాబ్దాల్లో నెలకొన్న అసాధారణ విపత్తు. రాష్ట్రంలో ఉన్న అన్ని మండలాల్లో తక్కువ వర్షం పడటం అరుదైన సందర్భం కాగా ఒక నెలలో కాకపోతే తేదుపరి నెలలోనైనా చినుకు పడుతుందన్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. అన్ని జిల్లాల్లో వర్షాభావం తీవ్రంగా ఉంది. ఖరీఫ్ సాధారణ సాగు నామమాత్రమే సాగుచేశారు. సాగయ్యాయన్న పంటల్లో నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, డ్రైస్పెల్స్, భూగర్భ జలాలు లోతులు చూడటం, విద్యుత్ కోతల కారణంగా 50 శాతమే, అదీ అతి కష్టం మీద చేతికొచ్చే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఒక్క గోదావరి పరి వాహక ప్రాంతాలు తప్ప రాష్ట్రంలో మరెక్కడా పంటలకు గ్యారంటీ లేదు. శ్రీశైలంలో తెలంగాణ, ఎ.పి పోటాపోటీ జల విద్యుదుత్పత్తి వలన రాయలసీమ, ఇతర ప్రాంతాలకు కనీసంగా తాగు, సాగునీటికి సమస్య ఏర్పడింది. నీటి పంపకాల పంచాయితీపై కేంద్రం తమాషా చూస్తోంది.కరువును ఆపలేకపోయినా బహుముఖంగా ప్రణాళికబద్ధంగా ముందస్తు చర్యలతో సమర్ధవంతంగా ఎదుర్కొని నష్టాలను తగ్గించడం ప్రభుత్వ బాధ్యత. వేసిన పంటలను కాపాడటం, ఖాళీగా ఉన్న భూముల్లో ఏదోఒక పంటను చేయించడం చేయాలి. అందుకు రైతులకు విత్తనాలు, పెట్టుబడులు సమకూర్చాలి. ప్రభుత్వం ఆ దిశలో ఆలోచించట్లేదు సరికదా జలహారతులంటూ ప్రచారార్భాటాలకు పోతోంది. ఈ చర్యలు కరువును తక్కువ చేస్తాయి. పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడంతోపాటు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలి. రుణమాఫీ, రుణాల రీషెడ్యూల్ చేయాలి. పశువులకు తాగునీరు, గ్రాసం అందుబాటులో ఉంచాలి. వ్యవసాయ కార్మికులకు అదనంగా పనులు చూపించి వలసలను నివారించాలి. ఇప్పటికే అనేక జిల్లాల్లో వలసలతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయి. అలాగే నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయాలి. దేశంలోకెల్ల రాష్ట్రంలోనే కరువు తీవ్రంగా ఉన్నందున కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. డబుల్ ఇంజిన్ సర్కార్‌గా చెప్పుకుంటున్న మోడీ, ఇతోధికంగా రాష్ట్రానికి కరువు సహాయం అందించాలి. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేయాలి.

# 24న జాబ్ మేళా నిర్వహణ : జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

- హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మం వరుణ్ మోటార్స్, భారత్ హ్యుందాయ్ లలో 127 ఉద్యోగ ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మం లోని వరుణ్ మోటార్స్, భారత్ హ్యుందాయి లలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లో పని చేసే విధంగా అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ గా పని చేయుటకు 18-35 సంవత్సరాల వయస్సు గలవారు, సంబంధిత ఉద్యోగానికి డి ఫార్మసీ / బి ఫార్మసీ / ఎం ఫార్మసీ (పిసిఐ) / ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల 500 నుండి 25 వేల వరకు ఉంటుందని అన్నారు.ఖమ్మంలో పని చేసే విధంగా వరుణ్ మోటార్స్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ / టెక్నీషియన్/సెక్యూరిటీ/ అడ్వైజర్ ఉద్యోగాలకు 22 నుండి 40 వయస్సు గల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 15 వేల నుండి 30 వేల వరకు ఉంటుందని, ఖమ్మం భారత్ హ్యుందాయి లో ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్/ టెక్నీషియన్/ టెలి కాలర్ ఉద్యోగాలకు 23 నుండి 30 సంవత్సరాల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 18 వరకు ఉంటుందని తెలిపారు.మొత్తం దాదాపు 127 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని, ఇతర వివరాలకు హెచ్ ఆర్ నంబర్ 928411-07531, 70369-02902, 72079-17714 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కిలారు కుటుంబాని పరామర్శించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఇటీవలే పరమపదించిన వి.వెంకటాయపాలెంకు చెందిన కిలారు రామారావు నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కవిత డిగ్రీ కళాశాలలో "ది పారడైజ్" సినిమా ప్రమోషన్





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న "ది పారడైజ్" సినిమా ప్రమోషన్ కార్యక్రమం మంగళవారం స్థానిక గట్టయ్య సెంటర్ లోని కవిత డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు (ముఖ్య పాత్ర) హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో తామే హీరోలుగా అనుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే తన త్వరలో విడుదల కానున్న సినిమాను అందరూ చూసి ఘన విజయం చేయాలని కోరారు. పలువురు విద్యార్థులు యువ ఉత్సాహంతో ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పి. ఉషా కిరణ్ కుమార్, యూజీ ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాధాకృష్ణ మూర్తి , పిజి ప్రిన్సిపాల్ డా. పి. రోజారాణి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## ఖమ్మంలో పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎం పి వద్దిరాజు రవిచంద్ర





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** దేవదేవుడు వినాయకుడి కృపా కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,ప్రజలు శాంతి, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. ఖమ్మంలో మంగళవారం ఆయన పలు మండపాలను సందర్శించి గోత్ర నామంతో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ మనం ఏ శుభ కార్యం తలపెట్టినా మొట్టమొదట గణనాథుడికి పూజలు చేస్తామన్నారు. హైదరాబాద్ లో మాదిరిగా ఖమ్మంలో కూడా కొన్నేళ్లుగా వినాయక నవ రాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నార న్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా కూడా గణనాథుని ఆశీస్సులతో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమాగా చెప్పారు. వినాయక నవ రాత్రోత్సవాల సందర్భంగా ఖమ్మం నగర ప్రజలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఎంపీ వద్దిరాజు పలు మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఖమ్మంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు మండపాలను సందర్శించి గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు.మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ నాయకులు తోట రామారావు-గోవిందమ్మ దంపతులు,వారి కుమారులు రమేష్, డాక్టర్ లక్ష్మణ్ ల ఆహ్వానం మేరకు ఎంపీ రవిచంద్ర 46,47,48 డివిజన్లలోని సారథి నగర్, గణేష్ నగర్, వెంకటేశ్వర నగర్,జూబ్లీ పుర,శుక్రవారం పేట, పద్మావతి నగర్,బొక్కలగడ్డ తదితర చోట్ల ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహాలను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీలను తోట రామారావు శాలువాలతో సత్కరించారు.ఆ తర్వాత సుంకర చిరంజీవి ఆహ్వానం మేరకు బొమ్మనా సెంటర్ లో కొలువైన గణనాథుడిని ఎంపీ రవిచంద్ర సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అలాగే ఆయన శివాలయం సెంటర్ లో నెలకొల్పిన భారీ మట్టి వినాయకుడికి పెద్ద పూలమాల సమర్పించి హోమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను అక్కడి భక్తమండలి సభ్యులు మదూరి సైదారావు,సాయికుమార్, నాగేందర్,గోపీ, ప్రసన్న లక్ష్మి, రాకేష్,శరత్, శ్రీనివాస్, మానస,సుజాత తదితరులు శాలువాలతో సన్మానించారు.మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం-రమాదేవి దంపతుల ఆహ్వానం మేరకు ఎంపీ వద్దిరాజు బురహాన్ పురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన గణనాథుడిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు,వేద పండితుల ఆశీర్వచనాలు అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగల రాజేందర్,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీలను వీరభద్రం శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా గుండ్లపల్లి శేషగిరిరావు,గూడ రాజేష్ ఆలేటి వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు. అలాగే,ఎంపీ వద్దిరాజు ముస్తాఫా నగర్,మేదర బజార్, బైపాస్ రోడ్డు తదితర చోట్ల గణేష్ మండపాలను సందర్శించి కొబ్బరి కాయలు కొట్టారు.ఈ సందర్భాలలో ఎంపీ రవిచంద్ర వెంట నానబాల హరీష్,మద్దెల భానుప్రతాప్ తదితరులు ఉన్నారు.

## వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత కర్నాటి కృష్ణ





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల వన్ టౌన్ ఏరియాలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న ఖమ్మం నగర మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి క్రిష్ణ , డిప్యూటి ఫ్లోర్ లీడర్ ఎస్ కే మగ్బుల్. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను కర్నాటి క్రిష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు అందించాలని విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్ , మాజీ కార్పొరేటర్స్ పగడాల శ్రీవిద్య , ప్రశాంత లక్ష్మి , వన్ టౌన్ ఏరియా నాయకులు ఎస్ కే తాజ్ దీన్ ' తోడేటి లింగరాజు యాదవ్, మాటేటి కిరణ్, కంచర్ల దయకర్, సాయికిరణ్, మాజీ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ లక్ష్మీ ప్రసన్న , సయ్యద్ సాజీద్ , సాయిక్రిష్ణ, ఎం డి షారుక్ , సంపటి గణేష్ , నల్లగట్ల పుల్లయ్య , చింతల సాంబ , సంపటి గౌతమ్ , నయియ్, తజముల్ , గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వెలుగుమట్ల కాలనీని నవంబర్ 21లోగా అన్ని మౌళిక వసతులతో ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలి
- రబీకి ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికను సెప్టెంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలి
- అక్టోబర్ నుంచి జూన్ వరకు పనుల సీజన్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- ఖమ్మం నగర విద్యుత్ అవసరాలకు పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి
- ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన మంత్రి







**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులు చాలా కాలంగా ఆలస్యమవుతున్నాయని, పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీలించి, అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అవసరమైన 10-ఏ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే ధోరణిని మార్చుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతతో పనిచేయాలని అన్నారు. డ్రైనేజీ డిజైన్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ లేఅవుట్‌ను త్వరగా తుది రూపంలో సిద్ధం చేయాలని, వచ్చే వర్షాకాలంలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సాగునీరు, త్రాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అన్నారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, షట్టర్లు, నీటి మట్టాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వచ్చే సీజన్ నుంచి అన్ని నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు.త్రాగునీటిని జాగ్రత్తగా వినియోగించాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని, నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని, నాలుగు లేన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా అవసరమైన అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి కేబుల్ బ్రిడ్జితో పాటు ప్రారంభించేలా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.మంజూరైన అన్ని పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించేలా సెప్టెంబర్ నెలాఖరులోగా టెండర్లు, ఇతర పత్రాల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు అనుకూలమైన పనుల సీజన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని తెలిపారు.వచ్చే రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. నాగార్జున సాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, కాలువల ద్వారా సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రత్యామ్నాయ రబీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను అనుకూలంగా వినియోగించుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా పెంచాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారికి తదుపరి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారికే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వెలుగుమట్ల కాలనీలోని అన్ని ఇళ్లను నవంబర్ 21లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ లైన్లు, డ్రైనేజీ తదితర అన్ని మౌళిక వసతుల పనులను పూర్తి చేసి కాలనీని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేలా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను అనుసంధానం చేయాలని, మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఖమ్మం నగరానికి వచ్చే పదేళ్లలో అవసరమయ్యే విద్యుత్‌ను అంచనా వేసి సబ్‌స్టేషన్లను ప్రణాళిక చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లతో పాటు అవసరమైన ఇతర కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి విస్తరణ, భూగర్భ కేబుళ్లు, తదితర పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు దశల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అన్నారు.అన్ని పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి అవసరమైన పనులను చేపట్టాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో కనీస మౌళిక వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఖమ్మంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వచ్చే జూన్ లోగా పూర్తి చేయాలని, రాష్ట్రంలో తొలి యంగ్ ఇండియా స్కూల్‌గా ఖమ్మం పాఠశాలను ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఖమ్మంలో షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. కమ్యూనిటీ అసోసియేషన్లకు భూమి కేటాయింపులను ఒకే ప్రాంతంలో చేపట్టేలా స్థలాన్ని గుర్తించి అవసరమైన కేటాయింపులు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడ మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో హ్యామ్ రోడ్లకు సంబంధించి 10 పనులకు రూ.36.60 కోట్ల మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో ఏడు కొత్త సబ్‌స్టేషన్లు ప్రతిపాదించామని, వాటికి అవసరమైన భూములు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.ఈ సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే తగ్గిందని తెలిపారు. పెసర సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు.ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని, మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను పరిష్కరించామని, ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.ఈ సమీక్షలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ్ నగర్ బి బ్లాక్ లో బాల వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమార్చన..





**కొండాపూర్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** కొండాపూర్ డివిజన్ ప్రేమ్ నగర్ బి బ్లాక్ లో శ్రీ బాల వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం రోజు డాక్టర్ రమేష్ నేతృత్వంలో మహిళల చే కుంకుమార్చన కార్యక్రమం ను ఘనం గా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామీ వారి కృపా కటాక్షములు ప్రజలందరి పై ఉండాలని నిర్వహణ కమిటీ సభ్యులు స్వామి వారిని వేడుకున్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - పోచారం ఐటిసి పీఎస్ ఇనస్పెక్టర్ జగన్నాథ్



**ఘట్కేసర్ , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఎక్కడో దూర ప్రాంతం లో ఉండి ఆన్ లైన్ లో మోసాలు చేసే సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోచారం ఐటిసి పీఎస్ ఇనస్పెక్టర్ జగన్నాథ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం పిఎస్ పరిధి అన్నోజిగూడ మిత్రానగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి మండపాన్ని పోచారం ఐటిసి పీఎస్ ఇనస్పెక్టర్ జగన్నాథ్ సందర్శించారు. అనంతరం గణపయ్యకు సీఐ జగన్నాథ్ ప్రత్యేక పూజలు చెయ్యగా నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమం లో అసోసియేషన్ సలహాదారులు, మాజీ వార్డ్ మెంబర్ పయ్యావుల లక్ష్మి జానకిరాములు, అధ్యక్షులు పయ్యావుల సంతోష్ , ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ఆంజనేయులు గుప్తా, ఉపాధ్యక్షులు జంపాల వీరేశం , కోశాధికారి ప్రొద్దుటూరు వెంకటేశం గుప్తా, జాయింట్ సెక్రటరీ పయ్యావుల ప్రశాంత్, ఉత్సవ కమిటీ కన్వీనర్ పయ్యావుల సతీష్, కో కన్వీనర్లు మంగలి అనిల్,కొలను పాక ప్రభాకర్, తనోజ్ కుమార్, మహేష్, శ్రీను, వరుణ్ కమిటీ కార్యదర్శులు రాసకచుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- **శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రకటనలో ద్వారా తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు.శోభాయాత్రల్లో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.గణేష్ మండపాల నిర్వాహకులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# సారధి నగర్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

- **అన్నదానం మహాదానం : తోట రామారావు, గోవిందమ్మ**





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** సారధి నగర్ ప్రాంతం లోని చిన్నారులు అతి చిన్న వయసులోనే భక్తి భావంతో శ్రీ గణనాథుని ప్రతిష్టాపన చేసి శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ నామకరణంతో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు – గోవిందమ్మ దంపతులు పాల్గొని ఆ గణనాథుని దైవ దర్శనం చేసుకుని చిన్న వయసులోనే భక్తి భావంతో గణేష్ ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజుల నవరాత్రి ఉత్సవాల పూజలు చేసి భక్తులకు ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందించే విధంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం దైవభక్తికి నాంది అని ఉత్సవ కమిటీ సభ్యులను అభినందిస్తూ భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ కార్పొరేటర్ తోట రామారావు, గోవిందమ్మ దంపతులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్నదానం చేయడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు. మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆ గణనాథుడు ఆశీస్సులు, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పండగ రవి, పండగ ఉష, గుత్తి వెంకటేష్, సాగర్, రమణ అయ్యగారు వినోద్, తిరుపతి శివ ఉపేందర్ రెడ్డి కిరణ్ చిట్టిపోలు భద్రమ్మ సిహెచ్ వెంకటేశ్వర్లు అయ్యగారు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సాధికారత రాష్ట్ర పురస్కారాలు

- **2026కు దరఖాస్తులు ఆహ్వానం : జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల**

**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల సాధికారత, భద్రత, సామాజిక అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించేందుకు వ్యక్తిగత, సంస్థాగత కేటగిరీల వారిగా "వయోవృద్ధుల సాధికారత రాష్ట్ర పురస్కారాలు–2026" అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయో వృద్ధుల కోసం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు, స్వచ్ఛంద సంస్థలు, వయోవృద్ధుల సంఘాలు, వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థలు, వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల రక్షణ, సంక్షేమం, సాధికారతతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విశేష సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కొరకు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని, దరఖాస్తుదారుడు పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతో పాటు, సంబంధిత ధ్రువపత్రాలు జతపరచి సెప్టెంబర్ 26 సాయంత్రం 5.00 గంటల లోపు హైదరాబాద్ మలక్ పేట నల్గొండ ఎక్స్ రోడ్డులో గల దివ్యాంగుల సంక్షేమ భవన్లో ఉన్న దివ్యాంగుల, వయో వృద్ధుల సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాల కోసం 99516 29372, 9885826161 నంబర్లలో సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల సూచించారు.

# బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ ను పరామర్శించిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాతృమూర్తి బమ్మిడి విమల అనారోగ్యంతో మరణించారు. వారి చిత్రపటానికి డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అఖిలభారత యాదవ మహాసభ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బమ్మిడి శ్రీనివాస్ ను పరామర్శించి, వారు మాతృమూర్తిని అపురూపంగా చూసేవారని, కన్నతల్లి లేని లోటును ఎవరూ తీర్చలేరని, తమ జీవితాలను పణంగా పెట్టి, మనలను పెంచి పెద్ద చేసి, ప్రయోజకులను చూసిన ఆ రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని విచారంవ్యక్తం చేశారు. శ్రీనివాస్ కు మనోధైర్యం కల్పించి అఖిల భారత యాదవ మహాసభ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, అఖిలభారత స్లాబ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు మొరి మేకల కోటయ్య, యువజన నాయకులు బండారి ప్రభాకర్, పొదిలి భూపతి, వాగదాని కోటేశ్వరరావు, మల్లేష్ వాగధాని వలరాజు, బాబురావు, యువరవి, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యకు నైవేద్యం భక్తులకు అన్నప్రసాదం

- **సత్తుపల్లి లోని మహా గణనాథుడి సన్నిధిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి సేవాభక్తి పరిమళం**





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లిలో భక్తిభావం వెల్లివిరిసింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సత్తుపల్లిలోని శ్రీ మహాగణపతి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర వ్హించారు. గ ణ ప తి మాలధారణ చేసిన భక్తులకు మంత్రి పొంగులేటి స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం శ్రీ మహాగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. వినాయ క నవరాత్రి ఉత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో మంత్రి భక్తులతో కలిసి కొద్దిసేపు గడిపారు. ఆ వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

- **తిరుమలాపురంలో అవగాహన కార్యక్రమం**



**ఖమ్మం, చింతకాని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తిరుమలాపురం సర్పంచి చాపలమడుగు వీరబాబు అన్నారు. చింతకాని మండలం తిరుమలాపురం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమన్నారు. పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామంలో ఏ చిన్నారి పోషకాహార లోపంతో బాధపడకుండా చూడటమే లక్ష్యమన్నారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి గ్రామపంచాయతీ తరపున సహకరిస్తామని తెలిపారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి మాట్లాడుతూ తక్కువ బరువు, పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి పాలు, గుడ్లు, అదనపు పోషకాహారం అందించడంతో పాటు అవసరమైతే వైద్యుల సూచనల మేరకు పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించి వాటిని పిల్లలకు అందించే విధానాన్ని తల్లులకు వివరించారు. అనంతరం పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని సత్యవతి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, అంగన్వాడీ టీచర్ నాగ సితారత్నం, ఇందిరమ్మ డెయిరీ సీసీ కనకపుడి వెంకటేశ్వర్లు, గ్రామదీపిక బెజవాడ సావిత్రి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామపెద్దలు, తల్లులు గోగుల శిరీష, దీపిక, పార్వతి, రేణుక, కమల, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రపంచ రేబిస్ అవగాహనా వారోత్సవాలు



**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** 22 నుండి 28 వరకు జరిగే అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాని విజ య వ ంత ం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ, కుక్కలు, ఇతర జంతువుల కాటు వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని ప్రజలు తప్పక పాటించవలసిన జాగ్రత్తలు, కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి,గాయానికి పసుపు, మిరపపొడి, నూనె, మట్టి వంటి పదార్థాలు రాయకూడదు అని పేర్కొంటూ,జంతువు కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి అని పేర్కొంటూ ,వైద్యుల సూచన మేరకు రేబిస్ వ్యాక్సిన్ అవసరమైనప్పుడురేబిస్ఇమ్యూనోగ్లోబులిన్ (ఆర్ఐజి) తీసుకోవాలి అని, పెంపుడుకుక్కలకు క్రమంతప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని, వీధి కుక్కలను రెచ్చగొట్టకుండా, ముఖ్యంగా చిన్నపిల్లలు వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి అని,"రేబిస్‌ను నివారించవచ్చు – జంతువు కరిచినప్పుడు వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు." అని పేర్కొనడం జరిగింది.

## ఎన్టీఆర్ నగర్‌లో ఘనంగా వినాయక మండపంలో అన్నదాన కార్యక్రమం





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఎల్లమ్మబండ, ఎన్టీఆర్ నగర్ నందుగల శ్రీ సంతగురు రవిదాస్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయకుని మండపంలో మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ వేడుకలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిశోర్ కుమార్, హైదరాబాద్ మహిళా చైర్‌పర్సన్ అలకనంద, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైస్ చైర్మన్ కొండ వెంకటేష్ ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ ఆర్ సిసి ఐ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను, మొదటి రోజు ప్రతిష్ఠాపన నుండి చివరి రోజు నిమజ్జనం వరకు భక్తులు పాటించాల్సిన నిష్ఠ, పూజా విధానాలు, వ్రత మహత్యాన్ని ఎంతో వివరంగా పంచుకున్నారు. సమాజంలో ఆధ్యాత్మిక భావన, ఐక్యత పెరగడానికి ఇటువంటి ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం హైదరాబాద్ మహిళా చైర్‌పర్సన్ అలకనంద, జిల్లా వైస్ చైర్మన్ కొండ వెంకటేష్ ప్రసంగిస్తూ గణేష్ ఉత్సవాలను ఎంతో పద్ధతిగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న స్థానిక కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ మహా అన్నదాన కార్యక్రమానికి ప్రకాష్ కౌలాస్కర్ ముందుండి నాయకత్వం వహించి, సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ కౌలాస్కర్ మాట్లాడుతూ మండపం ఏర్పాటు చేసిన మొదటి రోజు నుండి నేటి వరకు పూజా కార్యక్రమాలను ఎంతో నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు. ఈ పండుగను ఇంత ఘనంగా జరుపుకోవడం తమకెంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా ఈ గణేష్ ఉత్సవాలను మరింత ఉత్సాహంగా, ఆటపాటలు, కోలాటాలతో భక్తిపారవశ్యంతో ముందుకు తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు.మండపంలో గణనాథుడికి నైవేద్యం సమర్పించిన అనంతరం స్థానిక భక్తులకు, ప్రజలకు భక్తిప్రపత్తులతో మహా అన్నదానం గావించారు. పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. పాల్గొన్న ప్రతినిధులు, కమిటీ సభ్యులు, ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కౌలాస్కర్ నారాయణ, ఉత్కర్ వెంకట్, కామలీకర్ శంకర్, కౌలాస్కర్ ప్రకాష్, కమల్ శెట్టి, రాందాస్ కమలేకర్, మహేష్, ఉత్కర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మహిళా కమిటీ ప్రతినిధులు ఉత్కర్ సునీత, టిలేకర్ మీనా, టీలేకర్ సోనీ, ఇతర లేడీస్ కమిటీ సభ్యులు పాల్గొని ఉత్సవాన్ని, అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు. భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## కార్మికుల హక్కుల రక్షణకు కట్టుబడి ఉంటాం

- **వేతనాల పెంపుకు, పనిభద్రతకు కృషి జరుగుతోంది**
- **చట్టబద్ధమైన సదుపాయాలు అమలు చేస్తాం**
- **శ్రమజీవుల పక్షానే నిరంతరం నిలుస్తాం**
- **అఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
- **కార్పొరేషన్ కార్మికులకు యూనిఫార్మ్, కాస్మొటిక్స్ అందించిన ఎమ్మెల్యే, మేయర్**





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** సమాజ నిర్మాణంలో నిరంతరం చెమటోడ్చే కార్మికుల హక్కుల రక్షణకు, వారి సంక్షేమానికి తాము సంపూర్ణంగా కట్టుబడి ఉంటామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కొత్తగూడెం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రెండేళ్లకు సంబంధించిన యూనిఫారాలు, కాస్మొటిక్స్ పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు దుస్తులు, సామగ్రిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజలకు ప్రాథమిక సేవలందిస్తున్న కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. కార్మికులు విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ, పని ప్రదేశాల్లో వారికి పూర్తి స్థాయి భద్రతను నిర్ధారిస్తామన్నారు. జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాల పెంపునకు కృషి చేయడంతో పాటు, చట్టబద్ధంగా వారికి లభించాల్సిన ప్రయోజనాలు, హక్కులను అమలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. శ్రమజీవులకు అండగా ఉంటూ వారి ఆశయాలు, అవసరాల పక్షానే నిలబడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, ధనలక్ష్మి , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నాయకులు కంచర్ల జమలయ్య, యూసఫ్, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్

- **స్వాతంత్ర్య సంగ్రామం లో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం**
- **ఏఐఎస్ఎఫ్ 90 వ వార్షికోత్సవాల ముగింపు గోడపత్రికను ఆవిష్కరణ**




**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ వాగ్ని రగిలించిన నిప్పుకణం, ప్రత్యేక తెలంగాణ సాధనకు తొలి దశ,మలి దశ ఉద్యమం లో వీరోచిత పోరాటం చేసిన సంఘం,దేశ చరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బూర మనోజ్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలో గల గిరిప్రసాద్ భవన్ లో ఈనెల 28,29, 30, తేదీల్లో హనుమకొండలో జరుగునున్న ఏఐఎస్ఎఫ్ 90,వార్షికోత్సవాల ముగింపు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలుపెరగని సమరశీల ఉద్యమాల వేదిక, దేశానికి ఎందరో త్యాగదనులను అందించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో నిత్యం విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరిగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని వారు అన్నారు.స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్రం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. మెకాలే విద్యా విధానం మాకొద్దంటూ విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాడి, కొఠారి కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ దే అన్నారు . చదువుతూ పోరాడు చదువు కై పోరాడు అన్న నినాదంతోని విద్య రంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించింది. ముఖ్యంగా యూనివర్సిటీలు భావ్య సమాజంలో మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ సొంతం అన్నారు. ,స్కాలర్షిప్స్ పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించినది. మహిళలపై జరుగుతున్న దాడులకు, అస్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినది ఏఐఎస్ఎఫ్అన్నారు.స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకొని విద్యార్థులు పోరాడాలన్నారు. .దేశ చరిత్రలో అటల్ బిహారీ వాజ్పేయి, జవహర్లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీజిన్నా లాంటి మహా మహా మేధావులను దేశానికి అందించిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ కి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నాగులమేరా, జిల్లా ఉపాధ్యక్షులు శివ నాయక్, మనోహర్, గోపి, శివ, పవన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటి జీవనశైలే వారిని ఆయుష్మంతులను చేసింది



**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** నాటి తరం మనుషులు పాటించిన ఆహారపు అలవాట్లు, సహజసిద్ధమైన ఆరోగ్యకరమైన జీవనశైలే వారిని నూరేళ్ల పాటు ఎలాంటి హానికరమైన జబ్బులు లేకుండా ఆరోగ్యవంతంగా ఉంచాయని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ ఆలీ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం, కసనా తండాకు చెందిన వృద్ధురాలు అజ్మీరా సుక్కమ్మ (85) సోమవారం రాత్రి స్వగృహంలో శాంతియుతంగా కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ ఆలీ మాట్లాడుతూ "ఆధునిక ప్రపంచంలో యంత్రాల జీవితం, కల్తీ ఆహారంతో నేటి తరం చిన్న వయస్సులోనే అనేక రోగాల బారిన పడుతుంటే, నాటి తరం పెద్దలు కష్టపడే తత్వంతో, సాత్వికమైన సహజ ఆహార అలవాట్లతో నూరేళ్ల పాటు ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితాన్ని గడిపారు. జీవితాంతం మంచాన పడకుండా, ఎవరికీ భారం కాకుండా ప్రశాంతంగా తుది శ్వాస విడిచే అదృష్టం సుక్కమ్మకి దక్కడం ఆమె పాటించిన ఆదర్శవంతమైన జీవనవిధానానికే నిదర్శనం. నేటి సమాజానికి, భవిష్యత్తు తరాలకు నాటి మనుషుల ఆచార వ్యవహారాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ఆవశ్యకం, ఆదర్శనీయం" అని మానవీయ కోణంలో వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. నేటి తరం ఎటువంటి జబ్బులు లేకుండా 85 ఏండ్లు జీవించడం అసాధ్యం అన్నారు. అందుకే వారు నేటి తరానికి ఆదర్శం అన్నారు. అమరజీవి సుక్కమ్మకి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు నాయకులు తమ లోతైన సానుభూతిని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ భాస్కర్ రావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, జగన్, కిషన్, రాంకోటి, జగన్నాథం, భానోత్ సక్రం, భీమా, బాబు మరియు గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ శేషజీవికి కన్నీటి వీడ్కోలు పలికారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రకటనలో ద్వారా తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్దీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు.శోభాయాత్రల్లో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.గణేష్ మండపాల నిర్వాహకులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# సారధి నగర్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

- అన్నదానం మహాదానం : తోట రామారావు, గోవిందమ్మ





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** సారధి నగర్ ప్రాంతం లోని చిన్నారులు అతి చిన్న వయసులోనే భక్తి భావంతో శ్రీ గణనాథుని ప్రతిష్టాపన చేసి శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ నామకరణంతో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు – గోవిందమ్మ దంపతులు పాల్గొని ఆ గణనాథుని దైవ దర్శనం చేసుకుని చిన్న వయసులోనే భక్తి భావంతో గణేష్ ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజుల నవరాత్రి ఉత్సవాల పూజలు చేసి భక్తులకు ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందించే విధంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం దైవభక్తికి నాంది అని ఉత్సవ కమిటీ సభ్యులను అభినందిస్తూ భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ కార్పొరేటర్ తోట రామారావు, గోవిందమ్మ దంపతులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్నదానం చేయడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు. మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆ గణనాథుడు ఆశీస్సులు, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పండగ రవి, పండగ ఉష, గుత్తి వెంకటేష్, సాగర్, రమణ అయ్యగారు వినోద్, తిరుపతి శివ ఉపేందర్ రెడ్డి కిరణ్ చిట్టిపోలు భద్రమ్మ సిహెచ్ వెంకటేశ్వర్లు అయ్యగారు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సాధికారత రాష్ట్ర పురస్కారాలు

- 2026కు దరఖాస్తులు ఆహ్వానం : జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల

**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల సాధికారత, భద్రత, సామాజిక అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించేందుకు వ్యక్తిగత, సంస్థాగత కేటగిరీల వారిగా "వయోవృద్ధుల సాధికారత రాష్ట్ర పురస్కారాలు–2026" అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయో వృద్ధుల కోసం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు, స్వచ్ఛంద సంస్థలు, వయోవృద్ధుల సంఘాలు, వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థలు, వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల రక్షణ, సంక్షేమం, సాధికారతతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విశేష సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కొరకు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని, దరఖాస్తుదారుడు పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతో పాటు, సంబంధిత ధ్రువపత్రాలు జతపరచి సెప్టెంబర్ 26 సాయంత్రం 5.00 గంటల లోపు హైదరాబాద్ మలక్ పేట నల్గొండ ఎక్స్ రోడ్డులో గల దివ్యాంగుల సంక్షేమ భవన్లో ఉన్న దివ్యాంగుల, వయో వృద్ధుల సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాల కోసం 99516 29372, 9885826161 నంబర్లలో సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల సూచించారు.

# బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ ను పరామర్శించిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాతృమూర్తి బమ్మిడి విమల అనారోగ్యంతో మరణించారు. వారి చిత్రపటానికి డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అఖిలభారత యాదవ మహాసభ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బమ్మిడి శ్రీనివాస్ ను పరామర్శించి, వారు మాతృమూర్తిని అపురూపంగా చూసేవారని, కన్నతల్లి లేని లోటును ఎవరూ తీర్చలేరని, తమ జీవితాలను పణంగా పెట్టి, మనలను పెంచి పెద్ద చేసి, ప్రయోజకులను చూసిన ఆ రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని విచారంవ్యక్తం చేశారు. శ్రీనివాస్ కు మనోధైర్యం కల్పించి అఖిల భారత యాదవ మహాసభ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, అఖిలభారత స్లాబ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు మోరి మేకల కోటయ్య, యువజన నాయకులు బండారి ప్రభాకర్, పొదిలి భూపతి, వాగదాని కోటేశ్వరరావు, మల్లేష్ వాగధాని వలరాజు, బాబురావు, యువరవి, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యకు నైవేద్యం భక్తులకు అన్నప్రసాదం

- సత్తుపల్లి లోని మహా గణనాథుడి సన్నిధిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి సేవాభక్తి పరిమళం





**ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లిలో భక్తిభావం వెల్లివిరిసింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సత్తుపల్లిలోని శ్రీ మహాగణపతి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర వ్హించారు. గ ణ ప తి మాలధారణ చేసిన భక్తులకు మంత్రి పొంగులేటి స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం శ్రీ మహాగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. వినాయ క నవరాత్రి ఉత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో మంత్రి భక్తులతో కలిసి కొద్దిసేపు గడిపారు. ఆ వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

- తిరుమలాపురంలో అవగాహన కార్యక్రమం



**ఖమ్మం, చింతకాని, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తిరుమలాపురం సర్పంచి చాపలమడుగు వీరబాబు అన్నారు. చింతకాని మండలం తిరుమలాపురం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమన్నారు. పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామంలో ఏ చిన్నారి పోషకాహార లోపంతో బాధపడకుండా చూడటమే లక్ష్యమన్నారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి గ్రామపంచాయతీ తరపున సహకరిస్తామని తెలిపారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి మాట్లాడుతూ తక్కువ బరువు, పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి పాలు, గుడ్లు, అదనపు పోషకాహారం అందించడంతో పాటు అవసరమైతే వైద్యుల సూచనల మేరకు పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించి వాటిని పిల్లలకు అందించే విధానాన్ని తల్లులకు వివరించారు. అనంతరం పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని సత్యవతి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, అంగన్వాడీ టీచర్ నాగ సితారత్నం, ఇందిరమ్మ డెయిరీ సీసీ కనకపుడి వెంకటేశ్వర్లు, గ్రామదీపిక బెజవాడ సావిత్రి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామపెద్దలు, తల్లులు గోగుల శిరీష, దీపిక, పార్వతి, రేణుక, కమల, చిన్నారులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా డీసీసీ నూతన అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డికి ఘన సత్కారం..

**శేరిలింగంపల్లి , సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ని కాంగ్రెస్ పార్టీ, ఐ ఎన్ టి యు సి, టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు, నాయకురాళ్లు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన డిసిసి అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ కార్యకర్తలతో సమన్వయంతో ముందు సాగాలని వారు ఆకాంక్షించారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా చిగురింత పారిజాత నరసింహారెడ్డి ని నియమించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి, మరియు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్ గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏ -బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, మహేశ్వరం నియోజవర్గం



మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీ సమత, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి , టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ముద్దంగుల తిరుపతి, టీపీసీసీ లేబర్ సెల్ శేరిలింగంపల్లి నియోజకవర్గం జనరల్ సెక్రటరీ బ్రహ్మానందం నాగరాజ్, ఉమ్మడి మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అడ్వైజర్, మియాపూర్ డివిజన్ మాజీ వార్డు మెంబర్ సంగీత వీరేందర్ గౌడ్, ముద్దంగుల హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ విలేజ్ గణనాథుని లడ్డూ వేలంపాటలో భక్తుల పోటీ..



**మియాపూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** మియాపూర్ గ్రామంలో త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలంపాట భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.ఈ వేలంపాటలో తాండ్ర రమేష్ రూ.1,71,000/ కు గణనాథుని లడ్డూను వేలంలో కైవసం చేసుకున్నారు. అలాగే మరో లడ్డూను డి. హన్మంతు గౌడ్ రూ.91,000/- కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా త్రిశూల్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, లడ్డూ వేలంలో పాల్గొని విజయవంతంగా కైవసం చేసుకున్న తాండ్ర రమేష్ , డి. హన్మంతు గౌడ్ కి మరియు వారి కుటుంబ సభ్యులకు గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు.వేలంపాట కార్యక్రమంలో భక్తులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 25 ఏళ్లుగా ఒకే చోట.. జూనియర్ అసిస్టెంట్‌దే పెత్తనమా.?

- **దేవాదాయ శాఖలో ఏం జరుగుతోంది, ఉన్నత అధికారులు పట్టించుకోరా.?**
- **ఆయన చెప్పిందే వేదం".. ప్రశ్నిస్తే. సమాచారం "ఇవ్వను.. తెలుసు" అంటూ సమాధానం.?**







**పాపన్నపేట, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** ఏడుపాయల వనదుర్గాభవాని దేవస్థానంలో హుండీ లెక్కింపు సందర్భంగా అధికారుల వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అచ్చనపల్లి శ్రీనివాస్ సుమారు 25 సంవత్సరాలుగా అదే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇంత సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న నేపథ్యంలో ఆయనకు అక్కడ విశేష ప్రాధాన్యం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని సంవత్సరాలుగా ఒకే స్థానంలో విధులు నిర్వహించడం దేవాదాయ శాఖ నిబంధనలకు పూర్తి విరుద్ధం అయిన ఉన్నత అధికారులు ట్రాన్స్ఫర్ చేయకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. హుండీ లెక్కింపు సందర్భంగా మీడియా ప్రతినిధులు వివరాలు కోరినప్పుడు, "ఆఫీసు వద్ద వాయిస్ ఇస్తాను" అంటూ ఈవో అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చకు దారితీసింది. ఇదే సమయంలో హుండీ లెక్కింపునకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించినప్పుడు "ఇవ్వను.. నాకు తెలుసు" అంటూ సమాధానం ఇచ్చినట్లు మీడియా ప్రతినిధులు చెబుతున్నారు. ఈవో సైతం హుండీ లెక్కింపు పై పూర్తి సమాచారం ఇవ్వకపోవడం వెనుక ఏమైనా గోల్మాల్ జరిగిందా అన్న అనుమానాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కంటే సిబ్బంది మాటే చెల్లుతుందా.?**

దేవస్థానంలో కీలకమైన హుండీ లెక్కింపులు, ఆదాయ వివరాలు వంటి అంశాల్లో అధికారిక సమాచారాన్ని మీడియాకు ఎవరు అందించాలి.? ఏ విధానంలో అందించాలి.? అన్నదానిపై స్పష్టత అవసరమని జర్నలిస్టులు పేర్కొన్నారు.ఒక ఉద్యోగి చెప్పిందే తుది నిర్ణయంగా మారుతోందా.? అధికారులపై సిబ్బంది ప్రభావం చూపుతున్నారన్న ఆరోపణల్లో వాస్తవమెంత? ఈవో సైతం కిందిస్థాయి ఉద్యోగులు చెప్పిన దానికే సై అనడం విచిత్రంగా మారిందని, అసలు ఈవో సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా లేకుంటే ఉద్యోగులకు అన్ని అప్ప చెప్పి ఏసీ గదిలో సేద తీర్చుకుంటున్నారా అన్న ప్రశ్నలు భక్తుల నుండి తలెత్తుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల విషయంలో శాఖాపరమైన మార్గదర్శకాలు పాటిస్తున్నారా.? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

భక్తుల కానుకలతో ముడిపడిన హుండీ ఆదాయంలో పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది. మీడియాకు సమాచారం ఇవ్వడంపై దేవస్థానంలో ఏదైనా అధికారిక విధానం ఉంటే దాన్ని బహిర్గతం చేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.25 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ పాత్రపై వస్తున్న ఆరోపణలు ఏమిటి.? హుండీ లెక్కింపులో సమాచారాన్ని వెల్లడించడంపై ఎవరి నిర్ణయం అమలవుతోంది.? అనే అంశాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని భక్తుడు కోరుతున్నారు. ఒకే చోట సంవత్సరాలుగా ఉన్న ఉద్యోగులను వెంటనే ట్రాన్స్ఫర్ చేయాలని లేని పక్షంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని భక్తులు పేర్కొన్నారు.

# 9 రోజులు పూజలు జరుపుకొని నిమజ్జనానికి పత్తికుంట చేరుకున్న గణనాధులు

- **ఈ యొక్క కార్యక్రమంలోభాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి - కన్వీనర్ వైస్ శ్రీధర్**



**రాజేంద్ర నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** 9వ రోజు మన రాజేంద్ర ప్రాంతంలో ఎక్కువ శాతం 9వ రోజు 9 రోజులు పూజలు జరుపుకొని నిమజ్జనానికి పత్తికుంట విభజరానికి భక్తులు రావడం జరుగుతుంది ఈ యొక్క కార్యక్రమంలో రాజేంద్ర నగర్ అసెంబ్లీ అసెంబ్లీ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ వైస్ శ్రీధర్ రాజేంద్రనగర్ డివిజన్ కన్వీనర్ జి బాబురావు జాయింట్ కన్వీనర్ ఈ వేణుగోపాల్ రెడ్డి శివ సురేష్ మూర్తి వివిధ డిపార్ట్మెంట్లో అధికారులు పాల్గొనడం జరిగింది ధన్యవాదాలు

# బాలాపూర్ గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**బాలాపూర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** బాలాపూర్ గణేష్ మండపం నిర్వాహకుల ఆహ్వానం మేరకు రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి సోమవారం బాలాపూర్ గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న మండప నిర్వాహకులను అభినందించారు. ఈ ఏడాది బాలాపూర్ గణేష్ మండపాన్ని పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ప్రత్యేకంగా రూపొందించడం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనంజయ, దూడల వెంకటేష్, బొబ్బిలి శేఖర్, ముదిరాజ్ మహేందర్ రెడ్డి, జీవన్ గౌడ్, లక్ష్మారెడ్డి, జగదీష్, శేఖర్, పవన్, రాము, విజయ్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మైలర్ దేవ్ పల్లి సర్కిల్లోని పలు గణేష్ మండపాలను సందర్శించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్ర నగర్, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ఈరోజు మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో కొలువై ఉన్న పలు గణేష్ మండపాలను సందర్శించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, మైలర్ దేవ్ పల్లి లోని ★పద్మశాలిపురం,మాధుభన్ కాలనీ, అర్జన్ బస్తీ ఎన్టీఆర్ నగర్, బుద్వేల్ ★ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ఆయన స్వయంగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలర్ దేవు పల్లి డివిజన్‌లోని పలు ప్రధాన మండపాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరికీ ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మెండుగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న



ఉత్సవ కమిటీ సభ్యులను మరియు యువకులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ నాయకులు, ఉత్సవ సమితి నిర్వాహకులు, కాలనీవాసులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620